## పేదల కష్టాలు తీర్చేందుకు సాంకేతికత ఉపయోగపడాలి: గవర్నర్

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలోని హెచ్ఐసీసీలో 34వ భారతీయ ఇంజినీరింగ్ కాంగ్రెస్ సమావేశం శుక్రవారం జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, మంత్రి ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పేదల బతుకులు మార్చేందుకు సాంకేతికత ఉపయోగపడాలన్నారు. కృత్రిమ మేధతో ఇంజినీర్లు తమ ప్రతిభ, పనితీరుకు పదును పెట్టాలి. ఇంజినీరింగ్ కృషి దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన ఇంజినీరింగ్ కృషి అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. పర్యావరణాన్ని పాడు చేయకుండా అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 28-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 131 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# లౌకికతత్వాన్ని పాటించేది టీఆర్ఎస్ మాత్రమే

- మతంపేరుతో సమాజాన్ని, ప్రజలను విడదీయాలని చూస్తే ఊరుకోం
- సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి బలపడాలని బీజేపీ చూస్తుంది
- భార్యనే గెలిపించుకోనే సత్తాలేని ఉత్తమ్.. మాపై విమర్శలా?
- కేసీఆర్ తర్వాత సీఎం కేటీఆర్‌నే
- ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో ఎన్నికలు వస్తే చాలు కులమతాలను రెచ్చగొట్టడం ఆనవాయితీగా మారిందని, మతం పేరుతో సమాజాన్ని, ప్రజలను విడదీయాలని చూస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. బీజేపీ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలనుకుంటున్నారని శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దేశాన్ని ఎలా రక్షించాలని ఆలోచించడం లేదని, దేశంలో లౌకికతత్వాన్ని పాటించే పార్టీ టీఆర్ఎస్ మాత్రమేనన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు హైదరాబాద్‌లో ఎప్పుడు కర్ఫ్యూ ఉంటుందో ఎవరికి తెలిసేదికాదని, కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని అన్నారు. అన్ని మతాల, కులాల పండుగలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, హైదరాబాద్ ప్రశాంతంగా ఉండడం బీజేపీ చూడలేకపోతుందని విమర్శించారు. హుజుర్‌నగర్‌లో బీజేపీకి ఎన్ని ఓట్లు వచ్చాయో లెక్కించుకోవాలన్నారు. సమ్మక్క – సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు ఎందుకు ప్రయత్నించడం లేదని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. సమ్మక్క – సారక్క జాతరను టీఆర్ఎస్ ప్రభుత్వం వైభవంగా నిర్వహిస్తుందని అన్నారు. ప్రపంచం అంతా తెలంగాణ వైపు చూస్తుంటే.. తెలంగాణ సమాజం కేసీఆర్ వైపు, యువత అంతా కేటీఆర్ వైపు చూస్తుందని అన్నారు. కేసీఆర్ తరువాత సీఎంగా కేటీఆరేనని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు రాష్ట్ర అభివృద్ధిని మెచ్చుకుంటుంటే రాష్ట్ర బీజేపీకి మాత్రం కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇంటి సభ్యులను గెలిపించుకోలేని ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. టీఆర్ఎస్ నాయకత్వాన్ని విమర్శిస్తారా అంటూ ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా సఖ్యత లేదని, సీఏఏ, ఎన్నార్సీ బిల్లు తర్వాత దేశంలోని పలు రాష్ట్రాల్లో గందరగోళం నెలకొందన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం మాత్రం ప్రశాంతంగా ఉందని అన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అఖండ విజయం సాధిస్తుందని, ఈ దెబ్బతో ప్రతిపక్షాలు తెలంగాణలో అవసరం లేదని ప్రజలు పేర్కొంటున్నట్లు రుజువవుతుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.





హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్. వేదికపై మండలి చీఫ్‌విప్ బోండకుంటి వెంకటేశ్వర్లు, మంత్రి సత్యవతి రాథోడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కె. కేశవరావు, పల్లా రాజేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

### ప్రజల అవసరాలు తీర్చడమే ..

# తెరాస ప్రభుత్వ లక్ష్యం

- ఆ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రజలంతా తెరాస వైపే ఉన్నారు
- మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకై ప్రతీఒక్కరూ కృషి చేయాలి
- తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఆమేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని అన్నారు. కొత్తగా పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తీసుకొచ్చామని, తెలంగాణ ఏర్పడ్డాక ఏ ఎన్నిక వచ్చినా ప్రజలు టీఆర్ఎస్‌కే పట్టం కట్టారన్నారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో బ్రహ్మాండమైన విజయం సాధించామని, విపక్షాల పరిస్థితి ఆడలేక మద్దెల ఓడినట్లుగా ఉందన్నారు. ప్రజల్లోకి వెళ్లాలంటేనే కాంగ్రెస్ భయపడుతోందని, తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. మేము నేల విడిచి సాము చేయడం లేదని, ప్రజలు సంపూర్ణమైన మెజార్టీ మాకు కట్టబెట్టారని అన్నారు. 2014లో 63సీట్లు గెలిచిన టీఆర్ఎస్, 2018లో 88సీట్లలో గెలిచిందని అన్నారు. తిరుగులేని రాజకీయ శక్తిగా టీఆర్ఎస్ అవతరించిందని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. ఎన్నికలకు టీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని, పల్లె ప్రగతి తరహాలోనే పట్టణ ప్రగతి కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. పల్లెలు, పట్టణాలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని కేటీఆర్ తెలిపారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం వచ్చిన తర్వాత గ్రామాల్లో అద్భుతమైన మార్పులు వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా మున్సిపాలిటీలకు నిధులిచ్చామని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలే ఎజెండాగా ముందుకు పోతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆరు లక్షల మందికి కేసీఆర్ కిట్ అందించామని, 40లక్షల మందికి ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని అన్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధిగా 60లక్షల మంది గులాబీ సైనికులున్నారని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. 95శాతం పార్టీ కమిటీల ఏర్పాటు పూర్తయిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# మూడు రాజధానుల అనే అంశమే హాస్యాస్పదం

- హైకోర్టును మార్చడం అంత ఈజీకాదు
- ఇప్పటికీ పరిపాలనపై వైసీపీ శ్రద్ధచూపటంలేదు
- బీజేపీ ఎంపీ సుజనా చౌదరి
- రాష్ట్రపతి కోవింద్‌ను కలిసిన సుజనాచౌదరి

హైదరాబాద్, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలనేదే బీజేపీ ఆకాంక్ష అని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరి అన్నారు. శుక్రవారం హైదరాబాదులో రాష్ట్రపతి కోవింద్ ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూడు రాజధానుల అనే అంశమే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. దీనికి నిరసనగానే బీజేపీ తరఫున తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మౌనదీక్ష కూడా చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని అన్నారు. వారికి కావాలనుకుంటే జగతి పబ్లికేషన్స్, భారతి సిమెంట్స్ ను వారి ఇష్టానుసారం మార్చుకోవచ్చని, కార్పొరేట్ ఆఫీసును రాష్ట్రంలో ఎక్కడికైనా మార్చుకోవచ్చని, కానీ రాజధానిని కూడా వారు కార్పొరేట్ సంస్థగా భావిస్తున్నట్టున్నారని దుయ్యబట్టారు. మూడు రాజధానులు అనే అంశమే హాస్యాస్పదమని సుజనా చౌదరి ఎద్దేవా చేశారు. హైకోర్టు వచ్చినంత మాత్రాన ఆ ప్రాంతాన్ని ఎవరూ రాజధాని అనరని, 30రోజులు మాత్రమే అసెంబ్లీ జరిగే ప్రాంతాన్ని కూడా రాజధాని అనరని చెప్పారు. ఆ గొప్ప జీఎన్ రావు ఒక సెషన్ (బడ్జెట్ సెషన్) వైజాగులో అంట నా నివేదికలో చెప్పారని విమర్శించారు. రెండేళ్ల వయసున్న పిల్లవాడు కూడా ఇది వింటే నవ్వుతాడని అన్నారు. వైసీపీ వాళ్లు ఆరోపించే విధంగా తాను ఆరోపణలు చేయలేనని, వైజాగ్ లో వాళ్లు భూములు కొనుక్కుంటే కొనుక్కుని ఉండవచ్చని సుజనా చౌదరి అన్నారు. రాజధానిపై వారి నిర్ణయాన్ని మాత్రం తప్పుబడుతున్నానని, ఇది ప్రజాస్వామ్యమా? లేక రాచరికమా? అని ప్రశ్నించారు. హైకోర్టును మార్చడం కూడా అనుకున్నంత సులువు కాదని, దీనికి కొలీజియం, సుప్రీంకోర్టు, రాష్ట్రపతి ఆమోదం కావాలని అన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించాలని చెప్పారు. ఈ ఏడు నెలల్లో పరిపాలనపై వైసీపీ శ్రద్ధ చూపించిన పాపాన పోలేదని సుజనాచౌదరి విమర్శించారు. రాజకీయ దుర్భాషలకే ప్రాధాన్యతనిచ్చారని మండిపడ్డారు.

# ఢిల్లీలో అత్యల్ప ఉష్ణోగ్రతలు!

### 118 ఏళ్ల తర్వాత పడిపోయిన టెంపరేచర్



న్యూఢిల్లీ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. అలాగే ఉత్తరాది కూడా వణుకుతోంది. చలి మంటలు కూడా చలిని అడ్డుకోలేకపోతున్నాయి.

ఎముకలు కొరికే చలికి ఢిల్లీ వాసులు వణుకుతున్నారు. గత వారం రోజుల నుంచి ఢిల్లీలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. 118 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. 1901లో తొలిసారిగా డిసెంబర్‌లో నెలలో ఉష్ణోగ్రతలు పడిపోగా.. మళ్లీ ఇప్పుడు నాటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ అతి శీతల రెండో డిసెంబర్ నెలగా నిలిచిపోనుంది.

భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. 1919, 1929, 1961, 1997 సంవత్సరాల్లో మాత్రమే డిసెంబర్ నెలలో ఢిల్లీలో 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది డిసెంబర్ నెలలో 26వ తేదీ నాటికి సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు.. 19.85 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. డిసెంబర్ 31వ తేదీ నాటికి 19.15 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ఒక వేళ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతే.. ఢిల్లీ చరిత్రలో 1901 తర్వాత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదైన రెండో డిసెంబర్ నెలగా 2019, డిసెంబర్ నెల నిలిచిపోతుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ఏడాది డిసెంబర్ 14వ తేదీ నుంచి వరుసగా 13 రోజులు ఉష్ణోగ్రతలు అత్యల్పంగా నమోదు అయ్యాయి. 1997, డిసెంబర్ నెలలో సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 17.3 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి.

# మున్సిపల్ ఎన్నికలతో రాజకీయ వేడి

## రిజర్వేషన్ల కోసం నేతల ఎదురుచూపు

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం స్తబ్ధుగా ఉన్న రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలతో రాజకీయపార్టీల్లో కదలిక కనిపిస్తోంది. రాజకీయపక్షాలు పురపాలికల్లో పట్టు పెంచుకునేందుకు పావులు కదుపుతున్నాయి. మరోమారు తమ సత్తాచాటుకనేందుకు తెరాస సిద్ధమవుతోంది. రానున్న స్థానిక, ఎన్నికలే లక్ష్యంగా చేసుకుని తమ వ్యూహానికి పదును పెడుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని రకాలైన ఏర్పాట్లు చేస్తోంది. తెరాస సమరోత్సాహంతో సత్తా చాటుకునేందుకు సమాయత్తమవుతోంది. పంచాయతీల్లో సాధించిన ఫలితాలే రిపీట్ చేసేలా కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తోంది. బాధ్యతలను నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇటీవల ఎన్నికల్లో గెలిచిన శాసనసభ్యులకు పార్టీ అధిష్ఠానం కట్టబెట్టడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చేదు ఫలితాలను చవిచూసిన కాంగ్రెస్ పార్టీ షాక్ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. రిజర్వేషన్ల ఖరారు కొలిక్కి రాకవడంతో కోర్టుకు వెళ్లే ప్రయత్నాల్లో ఉంది. అలాగే ససమర్థులైన అభ్యర్థులను తమ మద్దతుదార్లుగా రంగంలోకి దించేలా కసరత్తు సాగిస్తోంది. ఎన్నికల్లో ఆసక్తి కనబరుస్తున్న అభ్యర్థుల జాబితాను రిజర్వేషన్లకు అనుగుణంగా వడపోస్తూ.. ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఓటమికి భయపడకుండా ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బలం పెంచుకుంటామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఇటీవల ఆధిక్యం కనబరచిన చోట దీటైన అభ్యర్థులను రంగంలో దించేలా వ్యూహం పన్నుతున్నారు.

## ఇరాన్‌లో భూకంపం

### న్యూక్లియర్‌ప్లాంట్‌కు తప్పిన ముప్పు

తెహ్రాన్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): ఇరాన్‌లోని బుషెహ్ర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌కు సమీపంలో శుక్రవారం ఉదయం 5:23 గంటలకు భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5.1గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. బుషెహ్ర్ కు తూర్పు దిశలో 53 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం కేంద్రీకృతమైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే భూకంపం నేపథ్యంలో ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ మీడియా వెల్లడించింది. ప్రాణ, ఆస్తి నష్టంపై అధికారిక సమాచారం వెల్లడికాలేదు. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5కు పైగా నమోదైతే గణనీయమైన నష్టం సంభవించే అవకాశం ఉంటుంది. కానీ బుషెహ్ర్ న్యూక్లియర్ ప్లాంట్ చాలా బలమైన భూకంపాలను తట్టుకునేలా రూపొందించబడింది. ఇరాన్‌లోని చారిత్రాత్మక నగరమైన బామ్‌లో 2006లో భూకంపం వచ్చింది. 6.6 తీవ్రతతో సంభవించిన భూకంపానికి 26 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. బామ్ నగరం బుషెహ్ర్ ప్లాంట్‌కు దగ్గరగా ఉన్నప్పటికీ నాడు ఎలాంటి దెబ్బతినలేదు.

## మంచిగా పనిచేసే వారిని ప్రోత్సహించాలి: మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, డిసెంబర్27: 'పల్లెప్రగతి నిర్వహణపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జనవరి 2 నుంచి 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించే రెండో విడత పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని' మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బీఆర్‌కే భవన్‌లో రెండో విడత పల్లెప్రగతి నిర్వహణపై మంత్రి దయాకర్ రావు సమీక్ష నిర్వహించారు.'పల్లె ప్రగతి నిర్వహణతో దేశవ్యాప్తంగా రాష్ట్రానికి మంచి గుర్తింపు వచ్చింది. రెండో విడత నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయి సమావేశాల నిర్వహణను వెంటనే పూర్తి చేయాలి. గ్రామ పంచాయతీల కోసం ప్రతీ నెల రూ.339 కోట్లు విడుదల చేస్తున్నాం. పల్లెప్రగతితో యువకులు, మహిళలు, పెన్షనర్లను భాగస్వాములు చేయాలి. గ్రామాల వారీగా చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాల వివరాలపై బుక్‌లెట్ అందించాలి. పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చేలా చూడాలి. ప్రతీ గ్రామ పంచాయతీలో ట్రాక్టర్‌ల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి. పల్లె ప్రగతిలో ప్రజలను చైతన్యవంతం చేయాలి. గ్రామాల్లో నర్సరీల పెంపకం, వైకుంఠదామాలు, డంపింగ్ యార్డులకు స్థలసేకరణ చేయాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం లాంటి అంశాలపై దృష్టిసారించాలి. జనవరి 2 నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పాల్గొనాలి. గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పల్లెప్రగతిని సక్రమంగా నిర్వహించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలి. మంచిగా పని చేసేవారిని ప్రోత్సహించాలి. మెదక్ జిల్లా మల్కాపూర్ గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని' మంత్రి కోరారు.





ండో విడత పల్లె ప్రగతిపై హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సిఎస్ ఎస్‌కె జోషి.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మెదక్,,డిసెంబర్27(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని టాటా ఎస్ వాహనం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బుల్లితెర నటుడు కుశాల్ పంజాబీ ఆత్మహత్య

ముంబయి,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): 'ఇష్క్ మైనే మార్జవాన్' ధారవాహికతో ఎందరో అభిమానులను సొంతం చేసుకున్న కుశాల్ పంజాబీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం కుశాల్ ముంబయిలోని తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుశాల్ మృతితో భావోద్వేగానికి గురైన ఆయన స్నేహితుడు కర్ణవీర్ బోహ్రా ట్విటర్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. 'నువ్వు మృతి చెందావనే వార్త నన్ను నరకంలోకి తీసుకు వెళ్లింది.

ఇప్పటికీ నేను ఆ వార్తను నమ్మలేకపోతున్నాను. సంతోషమైన జీవితాన్ని గడుపుతున్న నువ్వు ఇలా ఎందుకు చేశావో అర్థం కావడం లేదు. జీవితాన్ని చూసే కోణంలో ప్రతిసారి నన్ను ఎంతగానో ఇంప్రెస్ చేశావు. ఒక డ్యాన్సింగ్‌డాడీగా ఎప్పటికీ నిన్ను గుర్తుపెట్టుకుంటాను.' అని కర్ణవీర్ పేర్కొన్నారు. కర్ణవీర్ పెట్టిన పోస్ట్‌పై స్పందించిన పలువురు నటీనటులు, నెటిజన్లు.. కుశాల్ మృతి పట్ల షాక్‌కు గురయ్యారు. నటి శ్వేత తివారీ.. 'వాట్.. ఓ మైగాడ్.. ఎప్పుడు? ఎలా?' అని కామెంట్ పెట్టగా.. 'వాట్? ఇది ఎప్పుడు జరిగింది. ఇది నిజంగానే చాలా బాధకరమైన విషయం. నేను నమ్మలేకపోతున్నాను. అతని ఆత్మకు శాంతి చేకూరాలి.' అని వికాస్ కలాంత్రి అనే నటుడు తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ నేరెళ్ల వేణుమాధవు
సారించు చుబుకవనదు చూపు సంతకశపైనన్
కౌరించి ? కిడించి నుభంయు
తారకముగ జాతి కాసెన ధ్వన్యము కరుణన్!!

(డిసెంబర్ 28 నేరెళ్ల వేణుమాధవ్ జయంతి)



-రాధశ్రీ

సెల్: 9494481210

# ఏకాంతం ఒక వరం..!!

మనిషికి మనసు ఒక వరం. మనసుకు చింతన ఒక శాపం. ఒక్కోసారి మనసు మానస సరోవరం అయితే, ఒక్కోసారి సరస్సులకు రహదారిగా మారి పుష్పక విమానమవుతుంది. ఆలోచన అలజడి జీవితా నౌకను కుదిపేస్తున్న సమయంలో కుదురు కోసం ప్రతి మనిషి కోరుకునేది ఏకాంత వాసాన్నే! అలకలు పులకలు తీరేవేళ మనసు కూపస్థ మండూకమయితే చిత్రాల చింత ఒకింత తీరేదాకా కోపగృహవాసానికి పూర్వకాలంలో వెసులుబాట్లు ఉండేవట. ఎవరి ఏడుపు వారిని ఏడవనిచ్చే ఏకాంత సౌలభ్యం ఇప్పుడెక్కడ? ఆనందానికి హద్దులు లేవు. హృదిని కరిగించి మరిగించే విషాద భరిత స్థితికి ఏకాంతమే కూడలి స్థలి. తనను వీడి వెళ్లిన మోహన మూర్తిని తలిచి వగచి వగచి అశ్రుధారలో సొమ్మసిల్లిన యశోధరది ఏకాంతమే! ప్రాణనాధుని నిష్క్రమణతో అంతఃపుర మందిరానికే పరిమితమయిన నిద్రాముద్రిత రాకుమారి ఊర్మిళాదేవిదే ఇదే పరిస్థితి. కావ్యరచనకు అనువూ నెలవూ ఏకాంతమన్నది నాటి అల్లసానివారి భావమైతే ఏకాంతంగా ఆకాశంలో వీక్షించేను.

దేహాలు ఒక్కచోటే నివసిస్తాయి కానీ మనసులు మాత్రం ప్రపంచాన్ని చుట్టి వస్తాయి. అందులోనే అనేకానేక మాటలు, ధ్వనులు భాషలూ! ఇక ఏకాంతమంటే ఏమిటి? నలుగురిలోనికి చేరకుండా దూరంగా ఉండటమా? లేక ఒంటరి తనాన్ని అలవాటు పడటమా? మోదమంటే లభించేది, ప్రమోదమంటే అనుభవించేది వీటి మధ్య వెల్లివిరిసే ఆనందోత్సాహాల్ని నలుగురితోనూ పంచుకోవాలనుకుంటాడు మనిషి. అప్పటి అనుభూతిని మాత్రం ఒక్కడే స్మరించుకుంటాడు.

గదిలో ఒక్కరే ఉంటే అది ఏకాంతం కాదు. ఎందుకంటే ఆ ఏకాంతానికి కాస్తంత భంగం కలిగినా భరించలేరెవ్వరూ. గదిలో ఉన్నపుడు చుట్టూ ఆవరిస్తుంది ఏకాంతం. దాటగానే మనల్ని మనమే కాదనుకుని సమాజంలో కలసిపోతాము. ఏకాంతం అనేది స్థిరచిత్తాన్ని కలుగజేస్తుంది. ఎంతోమంది ఇష్టపడే ఏకాంతాన్ని మనమే ఒక్కోసారి భగ్నం చేస్తాము. ఈ యాంత్రిక యుగంలో కాల ప్రవాహంలో కాస్తంత శాంతి విశ్రాంతి అందించేది ఏకాంతంలోనే కదా? నిత్యం జీవిత భ్రమణంలో అనేకానేక అనుభవాల్ని పొందే ఎవ్వరికైనా ఎక్కడో ఒక దగ్గర ఎంతోకొంత సమయం ఏకాంత చిత్తులు కాగలిగితే సరికొత్త జవమూ జీవమూ ప్రాప్తిస్తుందని సారాంశం. పరిశీలించి చూడాలే కానీ సోమసుందర్ కలం పలికినట్లు పరమాణువు కన్నా యెడద నిజం సుమా అన్నట్లు / లేడికి లేచిందే పరుగు అన్నట్లు క్షణం తీరిక లేకుండా గడిపే యుతకు ఏకాంతత్వమే ఉత్తమ ఫలదాయకమని సామాజిక పరిశీలకుల విశ్లేషణలు ఇపుడే వెల్లడించాయి. ఆ రీత్యా చూసినపుడు ఎవరికైనా ఏకాంతమే ఆత్మంధువు అనుకుంటారేమో! కానీ ఏకాంతం అనేది మనల్ని మనకు తెలిపేది. ఏకాంతం అనేది అనుకూలంగా మార్చుకుంటే మనకోసమే మిగిలేది. ఏకాంతంతో మునులు, ఋషులు సాధించేది చాలా ఉంటుంది. ఏకాంతం అనేది ఒక శక్తి. మాటల మధ్య మనం కోల్పోయిన ఆత్మీయతలెన్నో! ఏకాంతంలో అలవడిన మౌనంతో సాధించే అనుభూతులెన్నో!!

నేటినిజం
శనివారం 28-12-2019

## ఓటర్ డే సందర్భంగా పోటీలు నిర్వహించాలి

### –ప్రజల్లో ఓటు చైతన్యం కలిగించాలి: కలెక్టర్

కామారెడ్డి,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో సూచించారు. జనవరి 25న జాతీయ పౌరుల దినోత్సవం సందర్భంగా నేషనల్ ఓటరు డే నిర్వహించాలన్నారు. నేషనల్ ఓటరు డే సందర్భంగా నియోజకవర్గాల వారీగా జిల్లా స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు.జనవరి 25న ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో కొత్తగా రిజిష్టర్ అయిన ఓటర్లకు ఎపిక్ కార్డులు, బ్యాడ్జీల ద్వారా సన్మానించేందుకు పోలింగ్ లెవల్ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారులు నియోజకవర్గాలకు రెండు కిలోమీటర్ల పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లో కొత్త ఓటర్లను ఎన్‌రోల్ చేసేందుకు, సన్మానించేందుకు సమావేశాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎక్కువ ఓటర్లను నమోదు చేయించిన చునావ్ పాఠశాల, ఈఎస్పీ స్కూల్స్, కళాశాలలను సన్మానించాలని సూచించారు. కార్యక్రమాలకు రాజకీయ పార్టీల ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని, మహిళా ఓటర్లను ప్రత్యేకంగా ఎన్‌రోల్ చేసేందుకు బీఎల్‌వోలకు శిక్షణ అందించాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి డీఈవో ద్వారా ఫోన్‌ఇన్ కార్యక్రమాలు, రెడియో, టీవీల ద్వారా కార్యక్రమాలు చేపట్టి ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ప్రింట్ మీడియా ద్వారా ప్రకటనను జనవరి 25న ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎలక్టోరల్, లిటరసీ క్లబ్ ద్వారా యూత్ ఓటరు ఫెస్టివల్ రిసోర్సు బుక్ చేపట్టాలని పేర్కొన్నారు. జనవరి 15న ఆర్మీడే సందర్భంగా నేషనల్ ఓటరు డే పైన సర్వీస్ పర్సనల్‌ను భాగస్వామ్యం చేసి అవగాహన చేపట్టాలని ఆదేశించారు.

## కొత్త మున్సిపాలిటీల్లో రిజర్వేషన్ల కుస్తీ

### ఏర్పాట్లలో తలమునకలయిన అధికారులు

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్నీ ఏర్పాట్లను చేసేందుకు మున్సిపల్ అధికారులు సన్నద్ధం అయ్యారు. ఇప్పటికే ఎన్నికల పనుల్లో ఇటు అధికారులు అటు సిబ్బంది తలమునకలయ్యారు. ప్రధానంగా కొత్తగా మున్సిపాలిటీలుగా ఏర్పడ్డ పట్టణాల్లో ఓటర్ల గణన సాగుతోంది. వార్డుల విభజన కొలిక్కి వచ్చింది. రిజర్వేషన్లపై కుస్తీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో రోజురోజుకూ పనుల్లో పురోగతి సాధిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలోని వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను తయారు చేసేందుకు సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అవతరించిన వాటిలో వార్డులకు గాను అసెంబ్లీ ఓటరు జాబితా నుంచి వార్డుల వారీగా ఓటర్లను గుర్తించి జాబితాను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే 80 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. టీపోల్ వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలను నమోదు చేయడాన్ని ప్రారంభించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే టీ పోల్ వెబ్‌సైట్ నుంచి ఓటరు జాబితాను డౌన్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాలయంలో సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 30వ తేదీన ఓటరు జాబితాకు సంబంధించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితాను నోటీస్ బోర్డులపై అతికించనున్నారు. ఎటువంటి మార్పులు, చేర్పులు ఉండవని కేవలం వార్డుల వారీగా మాత్రమే ఓటర్ల విభజన జరగుతుం దని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. మొత్తానికి ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేస్తున్నారు.



## ఆర్టీసీ బస్సులో మంత్రి మల్లారెడ్డి ప్రయాణం

హైదరాబాద్, డిసెంబర్ 27: రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఈవాళ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. నూతనంగా ప్రవేశపెట్టబోతున్న ఆర్టీసీ కార్గో బస్సు సర్వీసు, సంచార బయో సౌచాలయ బస్సులను నగరంలోని జూబ్లీ బస్‌స్టాండ్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి మల్లారెడ్డి నేడు పరిశీలించారు. అనంతరం జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రంలోని ప్రతీమూలకు ఆర్టీసీ కార్గో సర్వీసు అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని చోట్ల సరకు రవాణాకు రంగం సిద్ధమైందని పేర్కొన్నారు.

# విపక్షాలు బలం పుంజుకుంటాయా?

హైదరాబాద్, డిసెంబర్ 27:పౌరసత్వ చట్ట సవరణ ఆమోదం తరవాత దేశంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. చచ్చుపడిపోతున్న దశలో మరోమారు కాంగ్రెస్ తదితర పార్టీలకు అవకాశం చిక్కింది. కోల్డ్ స్టోరేజీలో పడిపోయిన పార్టీలన్నీ మరోమారు నిలదొక్కునే యత్నాలు మొదలు పెట్టాయి. అయితే ఈ చట్టంపై ప్రజలను తప్పుదోవ పట్టించడం ద్వారా విపక్షాలు రాజకీయ లబ్ధిపొందే యత్నాల్లో కొంతమేర విజయం సాధించాయని చెప్పాలి.

బిజెపి విజృంభిస్తున్న దశలో రాజస్థాన్, మధ్యప్రదేశ్,ఛత్తీస్‌ఘడ్ ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్ మళ్లీ కొంత పుంజుకుంది. తాజాగా మహారాష్ట్ర,జార్ఖండ్‌లలో బిజెపి పడిపోవడంతో కాంగ్రెస్‌కు జవసత్వాలు వచ్చాయి. ఈ దశలో ఇప్పుడు పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరును తమకు అనుకూలంగా మలచుకుని ప్రజల్లో విద్వేషాలు సృష్టించడంలో విపక్షాలు సఫలీకృతం అయ్యాయి. అయితే బలంగా ఉన్న బిజెపిని దెబ్బకొట్టేందుకు ఏకమవుతున్న చిన్నపార్టీల నైజం ప్రజలకు తెలియంది కాదు. అనేక విప్లవాత్మక మార్పులతో ప్రజల్లో మంచి స్థానం సంపాదించుకుంటునన బిజెపిని ఇప్పటికిప్పుడు దెబ్బకొట్టడం అంత సులువు కాదు. పౌరసత్వంపై ఎంతోకాలం ప్రజల్లో విషబీజాలు నాటలేరు. అది కేవలం విదేశాల నుంచి వచ్చే హిందువులు,తదితరలుకు ఉద్దేశించనదని అందరికి తెలిసిందే. ఆరునెలల క్రితమే మోడీ ద్వయం భారీ మెజారిటీతో రెండవ సారి అధికారంలోకి వచ్చింది. ఈ ఆరునెలల్లో ప్రతిపక్షాలు బలోపేతమైనవని చెప్పడానికి ఆధారాలు లేవు. కాని ఈ ఆరునెలల్లో భారతీయ జనతా పార్టీ వేగంగా తీసుకున్న నిర్ణయాలు ప్రతిపక్షాలకు మింగుడు పడడం లేదు. అయితే ఈ అంశాలు విపక్షాలు బలపడేందుకు ఆస్కారం కలిగించాయనడానికి కూడా లేదు. ఇకపోతే మహారాష్ట్రలో బిజెపి,శివసేన కూటమిదే విజయం అని గమనించాలి. జార్ఖండ్‌లో స్థానిక సమస్యలను పరిష్కరించడంలో అక్కడి బిజెపి నాయకత్వం పూర్తిగా విఫలమయ్యిందనడంలో సందేహం లేదు. జార్ఖండ్‌లో ప్రజల దైనందిన సమస్యలు, విద్య, వైద్య వ్యవస్థలు దిగజారిపోవడం, గిరిజన వ్యతిరేక నిర్ణయాలు, ముఖ్యమంత్రి అహంభావ ధోరణితో పార్టీలో ఏర్పడిన అసమ్మతి బిజెపి ఓటమికి దారి తీశాయి. ఇవన్నీ కూడా తాత్కాలికమే. ఇకపోతే పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం మైనార్టీల్లో అపోహలు సృష్టించడం వల్ల మెజార్టీ హిందువుల మనోభావాలు కూడా బలపడ్డాయి. వారంతా మోడీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నారు. ఈ రకంగా కాంగ్రెస్, తదితర విపక్షాలు గోల వల్ల మెజార్టీ హిందువుల్లో ఏవగింపు కలుగుతోంది. మమతా బెనర్జీలాంటి రాజకీయ అవకాశవాద నేతల రంగు బయటపడింది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఢిల్లీ, ఉత్తరాదిన జరుగుతున్న నిరసన ప్రదర్శనలతో దేశ రాజకీయ వాతావరణంలో ఒక్కసారిగా తమకు అనుకూలంగా మార్పును తీసుకుని వచ్చామని ఆయా పార్టీలు చంకలు గుద్దుకుంటున్నాయి. ఇది దేశంలో దాదాపు అన్ని పార్టీలను ఒక వైపు, భారతీయ జనతా పార్టీని మరో వైపు సమీకృతం చేశాయనడంలో సందేహం లేదు. అయితే ఇక్కడ ప్రజలు కూడా అలాగే విడిపోయారిన సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను బట్టి గమనించవచ్చు. బీహార్,ఉత్తర ప్రదేశ్‌తో పాటు దేశంలో వివిధ ప్రాంతాలు ఇంకా ఉద్రిక్తంగా ఉన్నాయి. ఈ పరిస్థితి ఎప్పుడు సద్దుమణు గుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఇంతమాత్రానికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. ఎందుకంటే దేశంలో బలమైన భారతీయ జనతా పార్టీని దెబ్బకొట్టే అవకాశాల గురించి ప్రతిపక్షాలు ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటాయి. అయితే అదంత ఈజీకాదని మొన్నటి ఎన్నికలు రుజువు చేశాయి. పార్టీని నడపలేక రాహుల్ గాంధీకాడి వదిలేసి పారిపోవడం ఇందుకు నిదర్శనంగా చూడాలి. దాదాపు బిజెపియేతర పార్టీలన్నీ కలిసికట్టుగా ప్రజల ఆందోళనను నిర్మించేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. దీనికి తోడు ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ గాలే నచ్చని అనేక సంస్థలు, మేధావి వర్గాలు ఎన్నో వీరికి తోడయ్యాయి. అన్ని రకాల శక్తులు కలిసికట్టుగా ఆందోళనకు దిగుతూ, తటస్థంగా ఉన్న వారిని కూడా తమ వైపుకు లాగడం ద్వారా బిజెపికి వ్యతిరేకంగా పరిస్థితిని తీసుకుని వచ్చామని భ్రమపడుతున్నాయి. పౌరసత్వ చట్టానికి అనుకూలంగా భారతీయ జనతా పార్టీ కూడా విపక్షాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యంగా నరేంద్ర మోదీ, అమిత్ షా వంటి బలమైన నాయకులతో ఉన్న పార్టీని ఎదుర్కోవడం అంత సులభం కాదని తెలిసినప్పటికీ ఏ చిన్న అవకాశం వచ్చినా ప్రత్యర్థులు వదులుకోవడం లేదు. కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు చేసినప్పుడు దేశభక్తి అనే సున్నితమైన అంశం ఇమిడి ఉన్నందువల్ల ప్రతిపక్షాలు బిజెపిని ఎదుర్కోవడంలో వెనకడుగు వేశారు. రామమందిరానికి అనుకూలంగా సుప్రీం కోర్టే తీర్పు ఇచ్చినందువల్ల ప్రతిపక్షాలు ఆచితూచి స్పందించాల్సి వచ్చింది. మోదీ హిందూత్వ, దేశభక్తి కార్డులను విజయవంతంగా ఉపయోగించుకొన్నప్పుడల్లా ప్రతిపక్షాలు నీరుకారిపోయాయి. కాని పౌరసత్వ సవరణ చట్టంతో ఏకం కావడానికి అవకాశం వచ్చింది. అయితే దీనితో విపక్షాలు ఏకం కావడంవల్ల బిజెపికి లాభించే పరిస్థితులు ఏర్పడ్డాయి. కేవలం మైనార్టీల మద్దతు మాత్రమే పొందిన విపక్షాలు మెజార్టీ హిందువుల మద్దతును కోల్పోతున్నాయి. బిజెపి కూడా ఇదే కోరుకుంటోంది. దేశవ్యాప్తంగా బిజెపియేతర రాజకీయ పార్టీలు, అనేక ఇతర వర్గాలు సంఘటితం కావాలనే బిజెపి కోరుకుంటుందని భావించాలి.

# మహారాష్ట్రలో బలపడుతున్న ఉద్ధవ్

### గతానికి భిన్నంగా శివసేనను తీర్చిదిద్దే యత్నం
### ప్రజలకు చేరువయ్యేలా నిర్ణయాలు
### తండ్రి బాలథాక్రే విధానాలకు భిన్నంగా నడక

ముంబై,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలో ఉన్న శివసేన మహారాష్ట్రలో మార్పును కోరుకొంటోందన్న భావన ప్రజల్లో కలుగుతోంది. ఉద్ధవ్ స్వభావరీత్యా తన తండ్రి బాల్‌థాక్రేకు భిన్నమైన వ్యక్తి. బాలథాక్రే రాజకీయాలలో సమరశీలత సహజంగా ఉట్టి పడుతుంది. ప్రతి సందర్భాన్ని ఉద్రిక్త భరితం చేయడం బాల్ థాక్రేకే చేతనవును. అది ఆయన వక్తృత్వంలో పూర్తిగా ప్రతిబింబిస్తుంది. శత్రువుని లక్ష్యం చేసుకోని పోరాడడంలో ఆయనకు ఆయనే సాటి. ఉద్ధవ్ థాక్రే అందుకు భిన్నింగా కనిపిస్తారు. వ్యక్తిగత సంభాషణల్లో అర్థవంతమైన వ్యక్తిగా, హేతుబద్ధంగా వ్యవహరించే నాయకుడిగా ఆయన కనపడతారు. ఆయన కుమారుడు ఆదిత్య ఆధు నిక విద్యాధికుడు. శివసేన దృక్పథంలో ఆధునికతను వికసింప చేయడానికి ఆదిత్య చాలా శ్రద్ధాసక్తులు చూపుతున్నారు. అయితే బిజెపికి కొమ్ముకాస్తూ పోవడంకన్నా తామే ప్రభుత్వం ఏర్పాటు చేసే క్రమంలో వారు బిజెపికి దూరమయ్యారు. కాంగ్రెస్,ఎన్సీపీల మద్దతు దక్కినా అది ఎంతకాలం నిలుస్తుందో చెప్పలేం. ఎందుకంటే కాంగ్రెస్, ఎన్సీప నేతల అవినీతి కారణంగా అనేక కేసులు నడుస్తున్నాయి. వాటిని తొలగించుకోవడానికే వారు శిసేనను పల్లకి ఎక్కించారు. ఆ పల్లకిని ఎంతకాలం మోస్తారన్నదానికి కాలమే సమాధానం చెబుతుంది. అయితే శివసేనను ప్రజల్లో మంచి పార్టీగా తీర్చిదిద్ది, తాము మంచి పాలకులమని పించుకోవడానికి ఉద్ధశ్ థాక్రే తన ప్రయత్నాలు మొదలు పెట్టారు. శివసేన చరిత్ర తెలిసిన వారికి ఈ మార్పు ఆశ్చర్యం కలిగించేదిగా ఉంటుంది. హింసారాజకీయాలలో విశ్వాసమున్న రాజకీయ పక్షంగా శివసేనకు పేరుంది. టోల్‌గేట్లపై దాడులు, క్రికెట్ పిచ్‌లను తవ్వివేయడం, పత్రికా కార్యాలయాలను ధ్వంసం చేయడం మొదలైన హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. చట్టాన్ని తన చేతిలోకి తీసుకోవడం శివసేనకు కొట్టిన పిండి. అయినపట్టికీ ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన ఇప్పుడు తన విధానాలను సమీక్షించుకుని ప్రజలకు చేరువ కావడానికి యత్నాలు మొదలు పెట్టింది. ఆమోదయోగ్యం కాని, అప్రజాస్వామిక అంశాలకు దూరంగా ఉంటోంది. అయినా శివసేన కార్యకర్తలు తమ ప్రస్తుత నాయకులు బాల్ థాక్రే మాదిరిగానే వ్యవహరించాలని కోరుకొంటున్నారు. సేన ప్రముఖులు కఠినంగా మాట్లాడాలని, హింసను రెచ్చగొట్టాలని వారు ఆశిస్తున్నారు. శివసేనకు, రాజ్ థాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేనకు మధ్యతీవ్ర పోటీ ఉండడమేనని చెప్పాలి. సంకుచితవాద ధోరణులను రెచ్చగొట్టడంలో రెండు పార్టీలూ పోటీపడుతున్నాయి. ఎవరికి వారు తమ పార్టీనే అగ్రగామిగా ఉండాలని కోరుకొంటున్నారు. ఉద్ధవ్ 2003లో ఉదార దృక్పథంతో 'మీ ముంబాయికార్' ఉద్యమాన్ని ప్రారంభించి నప్పుడు ముంబైకి వలసవచ్చిన ఉత్తరాది రాష్ట్రాల వారికి వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభించారు. అందరూ ఆ ఆందోళన వైపే ఆకర్షితులయ్యారు. మహారాష్ట్ర అస్తిత్వ పరిరక్షకులుగా ప్రజల్లో తమను తాము సుప్రతిష్ఠితం చేసుకోవాలన్న ఆకాంక్షే రెండు పార్టీల మధ్య తీవ్ర పోటీని రెచ్చ గొడుతోంది. మహారాష్ట్రలో అధికారానికి వచ్చాక శివసేన ఇప్పుడు తన అస్తిత్వానికి దూరంగా ప్రజలకు చేరువ కావాలని చూస్తోంది. సంప్రదాయక మరాఠీ ఓటు బ్యాంకుకే పరిమితం కాకుండా విశాల సమాజంలోని సకల సామాజిక వర్గాల వారిని తన వెనుక నమీకరించుకోవడానికి శివసేన సంకల్పించు కున్నట్లు గుర్తించవచ్చు. ఇందుకు ఆ పార్టీ తన గత చరిత్రకు ,విద్వేష రాజకీయాలకు దూరంగా మసలుకునే యత్నాలుచేస్తోంది. మహారాష్ట్రలో చాలా సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ –ఎన్సీపీ సంకీర్ణం ఇప్పుడు ప్రజల మద్దతును కోల్పోయింది. అందుకే శివసేన ఇకనైనా అనవసర వివాదాల్లో చిక్కుకోకూడదన్న భావనలో ఉద్ధవ్ థాక్రే ఉన్నారు. ఆరోగ్యకరమైన పాలన అందించడానికి నిబద్ధమైన పరిణత రాజకీయ పక్షంలా వ్యవహరించాలని నిర్ణయించారు. ముంబైలోను, మహారాష్ట్ర అంతటా తక్షణమే శ్రద్ధచూపవల్సిన సమస్యలపై మెల్లగా దృష్ట ఇసారిస్తున్నారు. రైతుల సమస్యలపై ముందు దృష్టి కేంద్రీకరించారు. మౌలిక సదుపాయాలు, తీవ్రమవుతున్న వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలను కనుగొనాలని నిర్ణయించారు. పారదర్శక పరిపాలన, ఉద్యోగాలను సృష్టించే అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే నమూనా పాలన చూపాలని చూస్తున్నారు. సంచలనాత్మక సంఘటనలను సృష్టించడం ద్వారా మీడియాలో ప్రాధాన్యం పొందడం వల్ల ప్రయోజనం లేదని తెలుసుకుని మసలుతున్నారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న శివసేన ఎదగవలసిన సమయమాసన్నమయిందన్న నిజాన్ని గుర్తించి తమకుతాముగా పథ నిర్దేశం చేసుకుంటున్నారు.

# మేడారం జాతర కోసం రాహుల్‌ను రప్పించే యత్నాలు?

### హిందువుల మదిలో వెలగాలని కాంగ్రెస్ తహతహ

న్యూఢిల్లీ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటి సారి 44 సీట్లకు దిగజారి పోయింది.

సోనియా హాయంలో రెండు పర్యాయాలు అధికారం అనుభవించాక ఇంతగా దిగజారి పోవడం ఇదే ప్రథమం. అలాగే రాహుల్ పట్టాభి షిక్తుడు అయ్యాక ఇప్పుడు నహజంగానే ఓటమి భయం వెన్నాడుతుంటుంది. అందుకే కొందరు రాహుల్‌ను హిందూ ప్రతినిధిగా ప్రజలు గుర్తించేలా చేయాలని తావత్రయపడుతున్నట్లుగా ఉంది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాహుల్‌ను మేడారం జాతరకు తీసుకుని రావాలని చూస్తున్నారు.

దీంతో అటు గిరిజనులను, ఇటు హిందూ ఓట్లను బుట్టలో వేసుకోవాలన్న ఆలోచనలో ఆ పార్టీ ఉంది. కెసిఆర్‌ను, బిజెపిని ఢీకొని మళల్‌ఈ అధికారంలోకి రావాలంటే జాతరల్లో ఓట్లను పట్టాలని చూస్తున్నారు. హిందుత్వ ఓట్లు నిజంగానే గంపగుత్తగా బిజెపికి పడివుంటే ఈ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది కాదు.

కానీ ముస్లిం సంతుష్టీకరణపై మాత్రం హిందువుల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ హయాంలో అనేక సందర్భాల్లో ముస్లింల కోసం కాంగ్రెస్ గీతదాటింది.దేశంలో బీజేపీ క్రమక్రమంగా ఎదుగుతున్న వైనాన్ని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గమనించినందువల్లనే బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో ఉదాసీనతతో వ్యవహరించారని, ఆయన వల్లే మైనారిటీలు దూరం అయ్యారని కాంగ్రెస్‌లో ఒక వర్గం ఆనాడు భావించింది. అందుకే తరవాత పివిని దూరం పెడుతూ వచ్చారు.

అర్జున్ సింగ్ వంటి నేతలు పి.వి. నరసింహారావు అనుసరించిన హిందూత్వ విధానాలపై లేఖాస్త్రాలు సంధించి ఇరుకున పెడుతూ ఉండేవారు. మాధవరావు సింధియా, చిదంబరం తదితర నేతలు పివిని తక్కువ చేసి చూశారు. పి.వి. హయాంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్న గాడ్గిల్ కాంగ్రెస్ రోజురోజుకూ క్షీణించిపోవడానికి కారణం ముస్లింలను బుజ్జగించే ప్రయత్నాలు చేయడమేనని చెప్పేవారు. సోనియా స్వతహాగా క్రిష్టియన్ కావడం, విదేశీ వనిత కావడం వల్ల ఇంతకాలం ఆమె హిందుత్వను అంగీకరించి ఉండకపోయి ఉంటారు. 2014లో నరేంద్ర మోదీ హయాంలో బీజేపీ ప్రభంజనం వీచిన తర్వాత నుంచీ కాంగ్రెస్‌లో ఈ మేరకు అంతర్మథనం ప్రారంభమైనట్లు సంకేతాలు కనపడుతున్నాయి. అప్పటివరకూ మైనారిటీల మద్దతు పొందేందుకు ఎటువంటి చర్యకైనా పూనుకునే దిగ్విజయ్ సింగ్ వంటి కాంగ్రెస్ నేతల వల్ల తమకు నష్టమే కాని లాభం లేదని కాంగ్రెస్ అధిష్ఠానం భావించే స్థితికి చేరుకుంది. అంతకు ముందు కుంభమేళాలకు హాజరు కావడం, అడపాదడపా ఆలయాలను సందర్శించడం కాంగ్రెస్ నేతలు చేసేవారు కాని అదే పనిగా ఆలయాలను సందర్శించే రాహుల్ గాంధీ వంటి నేతలు కాంగ్రెస్‌లో గతంలో ఎప్పుడూ లేరు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ దాదాపు 40కి పైగా ఆలయాలను సందర్శించారు. కర్నాటకలో ఈ ప్రయత్నం బెడిసికొట్టింది. కాంగ్రెస్ హయాంలో అక్కడ పాలన దిగజారింది. అందుకే బిజెపికి అనుకూల వాతావరణం వస్తోంది. దీనిని అధిగమించే ప్రయత్నాలు చేయడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీ బీజేపీ మార్గంలో నడిచేందుకు కూడా వెనుకాడడం లేదని అర్థం అవుతోంది.

## రైతులకు ప్రైవేట్ డెయిరీల గాలం?

వరంగల్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): పాడి రైతులకు విజయ డెయిరీ లీటరుకు రూ.4 నగదుగా చెల్లిస్తోన్న ప్రోత్సాహకం పథకం అందుతున్న గిట్టుబాటు కావడం లేదన్న భావన రైతుల్లో ఉంది. ప్రతి నెల బిల్లులు చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తున్నామన్నారు.

ఈ పథకం రద్దయ్యిందన్న వార్తల్లో నిజం లేదంటున్నారు. నెలలు గడుస్తున్నా నిధులు మంజూరు కాకపోవడంతో ప్రోత్సాహక పథకం ఉందా లేదా? అనే సంశయంలో పాడి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇదే అదనుగా చేసుకొని ప్రైవేటు డెయిరీలు విజయ డెయిరీ చెల్లించే పాల ధర కన్న లీటరుకు రూ.4లు ఎక్కువ ఇచ్చి రైతుల నుంచి పాలను సేకరిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో రైతులు ప్రైవేటు డెయిరీల వైపు మొగ్గు చూపుతున్నారు. విజయ డెయిరీకి పాలు పోసే ప్రతి రైతుకు లీటరుకు అదనంగా రూ.4ల చొప్పున చెల్లిస్తోంది. ఈ ప్రోత్సహంతో పాడి రైతులు పాలను ప్రైవేటు డెయిరీలకు పోయకుండా విజయ డెయిరీకే పోస్తున్నారు.

కొన్ని నెలలపాటు సక్రమంగా చెల్లించినా గత తొమ్మిది నెలలుగా నిధులు రాకపోవడంతో అనేకులు ప్రైవేట్ డెయిరీల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో రెండు, మూడు నెలలకోసారి ఇచ్చేవారని, అదనంగా ఇచ్చే డబ్బులు ఇవ్వకపోవడంతో చాలా మంది రైతులు విజయ డెయిరీని వదిలి ప్రైవేటు డెయిరీల వైపు పోతున్నారు.

## కొత్త జిల్లాల్లో ఆర్థిక సమస్యలు

### నిధుల కేటాయింపులో జాప్యం

మెదక్,డిసెంబర్27(నేటినిజం ప్రతినిధి)+ కొత్త జిల్లాల ఏర్పాటుతో అనేక ఇబ్బందులు ఏర్పడతాయని గతంలోనే బిజెపి నాయకత్వం తెలిపిందని బిజెపి అధికార ప్రతినిధి రఘునందన్ రావు అన్నారు. కొత్త జిల్లాల్లో ఇప్పుడు సమస్యలు నెలకొన్నాయని, ఆర్థిక సమస్యలు వేధిస్తున్నాయని అన్నారు. పూర్తిస్తాయిలో సిబ్బంది నియామకం జరగలేదన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడితే కేంద్రం ఎలాంటి నిధులు ఇవ్వబోదని.. దానికి సంబంధించిన విషయాలను ఆయా రాష్ట్రాలే చూసుకోవాలని అన్నారు. ఇప్పుడు అదే సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. పాలన ఒక దగ్గర ఉంటే ప్రభుత్వ కార్యాలయాలు మరోచోట ఉన్నాయని చెప్పారు. ఉద్యమం ద్వారా తెలంగాణ సాధించుకున్న రాష్ట్రంలో సమస్యలపై ఉద్యమించడం నేరంగా మారిందని ఆయన మండిపడ్డారు. వివిధ పోరాటాలు చేసి సాధించిన సొంత రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యమ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ ఉద్యమంలో విధ్వంసాలు, హింసలు చేలరేగినా.. గత పాలకులు ఉద్యమ నేతలను జైలుపాలు చేసిన దాఖలాలు లేవన్నారు. కానీ గత మూడేళ్ల నుంచి ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, రైతులు దేనిపైనైనా ఉద్యమిస్తే జైలుకు పంపుతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిరసనలు తెలిపేవారి గొంతు నొక్కడమే పనిగా పెట్టు కుందన్నారు.

## నేటితో మూతపడనున్న శబరిమల అయ్యప్ప ఆలయం

తిరువనంతపురం,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): శబరిమల అయ్యప్ప స్వామికి శుక్రవారంతో మండల పూజలు పూర్తవుతాయి. దీంతో మూడు రోజుల పాటు ఆలయ తలుపులు మూసుకోనున్నాయి. మకరజ్యోతి సందర్భంగా తిరిగి ఈ నెల 30 న ఆలయాన్ని తెరుస్తామని కమిటీ తెలిపింది. జనవరి 15 న జ్యోతి దర్శనం ఉంటుందని జనవరి 21 న ఆలయం తలుపులు మూసివేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఆలయానికి ఈ సంవత్సరం కనీవినీ ఎరుగని రీతిలో ఆదాయం లభించింది. గత నెల 16 న మండల పూజల సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకోగా ఇప్పటికి రూ.156 కోట్ల ఆదాయం వచ్చిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం తెలిపింది. గత ఏడాది ఇదే సీజన్‌లో రూ.105.29 కోట్ల మేర ఆదాయం వచ్చింది. శబరిమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. స్వామి వారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివస్తున్నారు. స్వామి దర్శనార్థం ఆన్‌లైన్‌లో ముందస్తుగా రిజర్వ్ చేసుకున్నవారికి 4 గంటలకుపైగా, రిజర్వ్ చేసుకోనివారికి 6 నుంచి 8 గంటల సమయం పడుతోంది. పవిత్ర పంపాలో మోకాళ్లకన్నా తక్కువ లోతుకు నీరు ఉండడంతో భక్తులు స్నానాలు ఆచరించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

## జీఎన్ రావు కమిటీ నివేదికతో ఏకీభవిస్తున్నా

### – మధ్యలోనే రాజధాని ఉండాలనే నిబంధన లేదు
### – రాజధానిగా విశాఖ బెస్ట్ ప్లేస్
### – అమరావతిలో భూములిచ్చిన రైతులకు న్యాయంచేయాలి
### – ఎంపీ సుబ్బిరామిరెడ్డి

అమరావతి, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : జీఎన్ రావు కమిటీ నివేదికతో ఏకీభవిస్తున్నానని, రాష్ట్రం మధ్యలోనే రాజధాని ఉండాలనే నిబంధన లేదని ఎంపీ సుబ్బిరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఢిల్లీ, ఉమ్మడి ఏపీ రాజధాని హైదరాబాద్ కూడా ఓ పక్కకు ఉన్నాయని తెలిపారు. కార్యనిర్వహక రాజధానిగా విశాఖను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కార్యనిర్వహక రాజధానికి కావాల్సిన అన్ని వసతులు విశాఖకు ఉన్నాయని తెలిపారు. కార్యనిర్వహక రాజధానిగా విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తెలుగు ప్రజలకు హైదరాబాద్ తర్వాత విశాఖే పెద్ద సిటీ అని చెప్పారు. రాజధాని కోసం కోసం 33వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం అన్నారు.

జీఎన్ రావు కమిటీ రిపోర్టు చూడలేదు కానీ.. పేపర్ లో వచ్చిన ప్రకారం అమరావతిలో అసెంబ్లీ, విశాఖలో ఎగ్జిక్యూటివ్ కేపిటల్, కర్నూలులో హైకోర్టు ఉండాలని, బెంచ్ ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నివేదిక సమర్పిస్తున్నట్లు తెలిసిందన్నారు. నివేదిక సరిగ్గా ఉందో లేదో.. ప్రభుత్వం నిర్ణయించాలన్నారు. నివేదిక ప్రజలకు ఉపయోగంగా ఉందా? లేదా? అనేది ప్రభుత్వం నిర్ణయించాలని తెలిపారు. అమరావతికి ఇబ్బంది కలుగకూడదన్నారు.

ఎందుకంటే అమరావతిలో ఇప్పటికే డబ్బు ఖర్చు పెట్టారని తెలిపారు. రైతుల క్షేమం కూడా చూడాలన్నారు. రాజధాని సెంటర్ ప్లేస్ లో దొరికితే మేలేనని.. లేకపోయినా ఇబ్బంది లేదన్నారు. విశాఖపట్నం సెంటర్ ప్లేస్ లో లేకపోయినా జీఎన్ రావు నివేదిక ప్రకారం విశాఖ...ఎగ్జిక్యూటివ్ కేపిటల్ గా ఉపయోకరంగా ఉంటుందన్నారు. విశాఖపట్నం చుట్టూ చాలా స్థలం ఉందన్నారు. అక్కడ అంతకముందే ఇన్ ఫ్రాస్టక్చర్ సరిపడా ఉందన్నారు. ఉమ్మడి ఏపీ విభజన కాకముందు తెలుగు ప్రజలకు హైదరాబాద్ తర్వాత విశాఖ పెద్ద సిటీ అన్నారు. 70 నుంచి 80 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తే అమరావతిని డెవలప్ చేస్తే బాగానే వుంటుందన్నారు. కానీ డబ్బు పెట్టే శక్తి లేదన్నారు. అమరావతిలో ఇన్ ఫ్రాస్టక్చర్ లేదన్నారు. కాబట్టి రెడీ మేడ్ సిటీ విశాఖపట్నం..ఇండస్ట్రీస్‌కు విశాఖ ప్రసిద్ధి అన్నారు. అంతకముందే విశాఖలో పరిశ్రమలు ఉన్నాయని, అక్కడికి పరిశ్రమలు రావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఏం నిర్ణయించినా, అమరావతి రైతులు బాధపడకుండా వారికి సహాయం చేయాలని కోరారు. అమరావతి రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఇబ్బంది లేకుండా చేస్తారని నమ్ముతున్నట్లు చెప్పారు. రష్ట్రానికి ఎగ్జిక్యూటివ్ రాజధానిగా విశాఖపట్నం బెస్టు ప్లేస్ అని సుబ్బిరామిరెడ్డి అభిప్రాయ పడ్డారు.

## నాయకత్వంపై ఆర్మీచీఫ్ వ్యాఖ్యలపై దుమారం

### ఆయన వ్యాఖ్యలను ఖండించిన పలువురు నేతలు

న్యూఢిల్లీ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): 'నాయకత్వం'పై ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలను పలువురు రాజకీయ నేతలు తీవ్రంగా ఖండించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల జాబితా (ఎన్నార్సీ)లపై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మక రూపం దాల్చడంపై ఆర్మీ చీఫ్ తీవ్ర స్థాయిలో స్పందించిన సంగతి తెలిసిందే. ప్రజలను సరైన మార్గంలో నడిపించలేని వాళ్లు నాయకులు కాదంటూ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యానించారు. యన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ ఎవరి పరిమితులు ఎంత వరకో కూడా నాయకత్వానికి తెలుసు. పౌర అధికార భావనను అర్థం చేసుకోవడానికి, మీరు నడిపిస్తున్న సంస్థ సమగ్రతను కాపాడేందుకు ఇది చాలా అవసరం.. అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ సైతం అంతే స్థాయిలో స్పందించారు. జనరల్ సాహెబ్‌తో నేను ఏకీభవిస్తున్నాను. అయితే మత కల్లోలాలు, మారణహోమాలకు తమ అనుచరులను రెచ్చగొట్టే వాళ్లు కూడా నాయకులు కాదు. మరి మీరు కూడా నాతో ఏకీభవిస్తారా జనరల్ సాహెబ్? అని డిగ్గీ ప్రశ్నించారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సీఏఏకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలు తీవ్ర హింసకు దారితీసిన సంగతి తెలిసిందే. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలపై ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ స్పందించారు. హింసాత్మక ఆందోళనలను ఆయన ఖండించారు. అటువంటి ఆందోళనలకు నాయకత్వం వహించే వాళ్లు అసలైన నాయకులు కాదని రావత్ విమర్శించారు. నాయకులంటే ముందు ఉండి నడిపించడమని, నాయకులు ముందుకు వెళ్తుంటే.. వారి వెనుక జనం ఉంటారని, సరైన మార్గంలో ప్రజలను తీసుకువెళ్లేవాళ్లే నేతలని, కానీ అసమగ్రమైన పద్ధతుల్లో ప్రజల్ని ముందుకు తీసుకువెళ్లేవాళ్లు నాయకులు కారని రావత్ చెప్పారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. వర్సిటీల్లో జరుగుతున్న ఆందోళనలను ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. వివిధ నగరాల్లో జరుగుతున్న హింసాత్మక ఆందోళనలకు కొందరు నాయకత్వం వహిస్తున్నారని, అలాంటి వారు సరైన నాయకులు కారన్నారు. మరికొన్ని రోజుల్లో రిటైర్‌కానున్న బిపిన్ రావత్.. తొలిసారి సీఏఏ ఆందోళనలపై మాట్లాడారు.

## ప్రజా సమస్యలపై సిపిఐ పోరాడుతూనే ఉంటుంది

### -వ్యవస్థాపక దినోత్సవంలో సురవరం

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): తాము ప్రజల కోసం ఎంతటి సుదీర్ఘ పోరాటానికైనా సిద్ధమని సిపిఐ పార్టీ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. చట్ట సభల్లో కమ్యూనిస్టుల సంఖ్య తగ్గినా ప్రజాక్షేత్రంలో పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సీపీఐ ఆవిర్భవించి 94 ఏళ్లైనా అధికారంలోకి రాలేదని అపహాస్యం చేస్తున్నారని అయితే తమకు అధికారం ముఖ్యం కాదన్నారు. సీపీఐ 95వ ఆవిర్భావ దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఎగరవేశారు. హిమాయత్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి 95 ఎర్రజెండాలతో సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, అజీజ్ పాషా పాల్గొన్నారు. ప్రదర్శనలో ప్రజానాట్యమండలి కళాకారుల ఆటా,పాటలు అలరించాయి. మతపరమైన రాజ్యం స్థాపించాలని ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ పార్టీ భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భాజపా కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతం పేరుతో రెచ్చగొట్టి సమాజాన్ని చీలుస్తున్నారని సురవరం సుధాకర్ రెడ్డి మండిపడ్డారు. మతోన్మాద చర్యలను అణిచివేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ ర్యాలీకి అనుమతి నిరాకరణ

### -అయినా నిర్వహించి తీరుతామన్న భట్టి

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): జాతీయ పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ నెల 28న హైదరాబాద్ లో ర్యాలీ తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ ర్యాలీకి అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, జీవన్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిశారు. సభ నిర్వహించుకోవడానికైతే అనుమతిస్తాం కానీ ర్యాలీకి మాత్రం ఇవ్వమని డీజీపీ స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హైదరాబాద్‌లో రోడ్లపై ధర్నాలు, నిరసనలకు అనుమతి లేదని సీపీ అంజనీకుమార్ స్పష్టం చేశారు. రోడ్లపై నిరసనల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడు తోందని అన్నారు. హైదరాబాద్ లో ఏ రాజకీయ పార్టీ అయినా సమావేశాలు నిర్వహించుకోవచ్చు కానీ, ఆయా పార్టీల కార్యాలయాల్లో మాత్రమే నిర్వహించుకోవాలని చెప్పారు. ఈ నెల 28న గాంధీభవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించాలనుకున్నామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. ర్యాలీకి అనుమతివ్వాలని కమిషనర్, డీజీపీకి లేఖ రాశామన్నారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డీజీపీ అన్నారని, ఒకవేళ అనుమతి ఇవ్వకపోయినా ర్యాలీ నిర్వహిస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## అల్లర్లలో కాశ్మీరీ ఆందోళనకారులు

### -కేంద్రమంత్రి అనుమానాలు

న్యూఢిల్లీ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టం, ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనపై కేంద్రమంత్రి నిత్యానందరాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నిరసనల వెనుక కశ్మీరీ ఆందోళనకారులు ఉన్నారని అన్నారు. ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా కశ్మీర్ వ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న వారే ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఘర్షణల వెనుక ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు. వారి కారణంగానే 16 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. యూపీ, బిహార్‌లో జరిగిన దాడుల్లో అక్కడి స్థానిక యువత ఎవరూ పాల్గొనలేదని అంతా కశ్మీర్ నుంచి వచ్చిన వారేనని అన్నారు. ఈ ఘటనలకు కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు కూడా మద్దతు తెలిపాయని మంత్రి విమర్శించారు. కాగా సీఏఏ, ఎన్ఆర్సీ కి వ్యతిరేకంగా యూపీ, బిహార్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనల్లో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో 16కు పైగా నిరసనకారులు మృతి చెందారు.

## జనవరిలో మరింత పెరగనున్నచలి

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం రాష్ట్రంలో చలి తీవ్రత తక్కువగా ఉన్నదని జనవరి తొలివారం నుంచి చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రానికి వీస్తున్న తేమగాలులతో రాత్రిపూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపింది.

రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతున్నాయంది. ఈ తేమగాలుల కారణంగా ఉత్తర తెలంగాణలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నట్లు పేర్కొంది. నిజామాబాద్, రామగుండంలో సాధారణం కన్నా 6 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు, నల్లగొండ, మెదక్‌లో అతి తక్కువగా 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు అదేవిధంగా హైదరాబాద్‌లో సాధారణం కన్నా 5 డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు వెల్లడించింది.

## ప్రగతిభవన్ ముట్టడికి నిరుద్యోగుల యత్నం

### -అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హాస్టల్ వార్డెన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు గురువారం ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు.

ఏడాదిన్నర క్రితం పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం నేటికీ ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేయకపోవడంతో గురువారం సీఎం కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చేందుకు అభ్యర్థులు ప్రగతి భవన్‌కు వచ్చారు. బృందాలుగా ప్రగతి భవన్‌కు చేరుకుంటున్న వీరిలో ముందస్తు చర్యల్లో భాగంగా 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏడాదిన్నర క్రితం లక్షమందికిపైగా పరీక్ష రాస్తే కేవలం 300 మందిని మాత్రమే ఎంపిక చేశారని అభ్యర్థులు వాపోయారు. ధ్రువపత్రాల పరిశీలన, ముఖాముఖి నిర్వహించి నెలలు గడుస్తున్నా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడం లేదంటూ అభ్యర్థుల బృందానికి నేతృత్వం వహించిన రాంగోపాల్ రెడ్డి, నర్మద, స్వాతి, సృజన తదితరులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే న్యాయం చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రాల్లో స్థానిక సమస్యలపై పోరాటం

### మారుతున్న కాంగ్రెస్ రణనీతి
### పార్టీ బలోపేతం కోసం దూకుడు నేతలకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ,డిసెంబర్27ఆర్ఎన్ఎ): రాహుల్ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను వదులుకున్నాక కాంగ్రెస్‌లో భారీ మార్పులు ఉంటాయన్న వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఇప్పటి వరకు అలాంటి ప్రయత్నం ఏదీ కనిపించలేదు. అయితే చాపకింది నీరులా ప్రయత్నాలు సాగుతున్నాయన్న సమాచారం మాత్రం ఉంది. రాహుల్‌కు అనుకూలంగా ఓ బలమైన టీమ్ ముందుకు రానుందని భావిస్తున్నారు. రాహుల్ పక్కా ప్లాన్‌తో ఉన్నారని సమాచారం. అందుకు అనుగుణంగా అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంతో పాటు, నమ్మదగిన బృందాన్ని ఎంపిక చేసుకుని ముందుకు సాగనున్నారు. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లో గట్టిగా పోరాడే యువరక్తాన్ని ఒడిసిపట్టుకునే ప్రయత్నాలు చేయవచ్చు. తెలంగాణనే తీసుకుంటే ఇక్కడ తెలంగాణ ఏర్పాటు, కాంగ్రెస్ కృషితో పాటు ప్రచార ప్రణాళిక సిద్దం చేయబోతున్నారు. రేవంత్ రెడ్డి లాంటి దూకుడున్న నేతలను ముందు వర సలో నిలబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక్కడా సామాజిక వర్గాలను చేరదీస్తారని ప్రచారం సాగుతోంది. కెసిఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న వివిధ వర్గాలను కూడగట్టుకుని, స్థానిక సమస్యలే ఎజెండాగా ముందుకు సాగేందుకు పక్కా ప్లాన్ వేస్తున్నట్లు సమాచారం. స్థానిక సమస్యలే ఎజెండాగా ప్రస్తావన ఉండేలా చూడబోతున్నారు. నోట్లరద్దు, జిఎస్టీ వల్ల గుజరాత్ దెబ్బతిన్న దృష్ట్యా అవే సమస్యలను ప్రధానంగా ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో సానుభూత లిని పొందాలని చూస్తున్నారు. కాంగ్రెస్‌లో ఇప్పుడు పరిస్థితి మారుతున్నట్లు కనపడుత ఎన్నది. దేశంలో బీజేపీయేతర శక్తులన్నిటినీ కూడగట్టుకుని తమది లౌకిక ఫ్రంట్‌గా ప్రకటించుకున్న సోనియాగాంధీ మరోమారు పౌరసత్వ చట్టంతో మళ్లీ విపక్షాలను ఏకం చేయగలిగారు. మోడీ లాంటి బలమైన నాయకుడిని ఢీకొనేందుకు అవలంబించిన సరికొత్త వ్యూహంగా చూడాలి. ముస్లింలను ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు తాము అనుసరించిన విధానాలను మళ్లీ పట్టుకోవాలని చూస్తున్నారు. పదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు, అవినీతి ప్రధానంగా నరేంద్ర మోడీ సారథ్యంలో బీజేపీ విజయం సాధించడానికి దారితీశా యి. హిందూత్వ రాజకీయాలే బీజేపీని అధికారంలోకి తేగలిగితే ఆ తర్వాత ఢిల్లీ, బీహార్ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ విజయం సాధించి ఉండేది. హిందూత్వ విధానాలే మోదీని గెలిపిస్తే గుజరాత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ దెబ్బతినేది కాదు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆకళింపు చేసుకుని ఆయా రాష్ట్రాల్లో ఉన్ననేతలను గుర్తించి ముందుకు సాగేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను పట్టుకుని వేళ్లాడుతున్న గబ్బిలాలతో లాభం లేదనుకుంటే నున్నితంగా పక్కన పెట్టడంలోనూ వెనకాడక పోవచ్చు.

## బీజేపీ గెలిస్తే అభివృద్ధికి ఆటంకమే




### - తెరాస గెలుపుతోనే కరీంనగర్‌లో అభివృద్ధి సాధ్యం
### - ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి
### - మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : వచ్చే నెలలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయం మేరకే అభ్యర్థులను నిర్ణయిస్తామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి గంగుల పాల్గొని ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగానే కరీంనగర్ జిల్లాలోని కార్పొరేషన్‌తో పాటు అన్ని మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులను కడుపులో పెట్టుకుని చూసుకుంటామన్నారు. నామినేటెడ్ పదవుల్లో సీనియార్టీ, క్రమశిక్షణ గల కార్యకర్తలకు స్థానం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చడానికి అప్పటి ఎంపీ వినోద్ కుమార్ ఎంతో కృషి చేశారని అన్నారు.

ఇప్పుడున్న బీజేపీ ఎంపీ బండి సంజయ్ మాత్రం కరీంనగర్ అభివృద్ధి అడ్డు తగులుతూ.. నిధులు తేలేకపోతున్నాడని మంత్రి ధ్వజమెత్తారు. బీజేపీ అభ్యర్థులు గెలిపిస్తే కరీనగర్‌లో అభివృద్ధి కుంటుపడిపోతుందని, కరీంనగర్ అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌లు ప్రకటించగానే.. రిజర్వేషన్ల ప్రకారం పార్టీ నిర్ణయం మేరకు మున్సిపల్ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, కానీ ప్రతిపక్షాలు మాత్రం గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తెరాస ప్రభుత్వ లక్ష్యమని, ఆమేరకు అన్ని విధాల కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. తెరాస అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అలా అని పార్టీ కార్యకర్తలు నిర్లక్ష్యంగా ఉండకుండా ప్రతీ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలని, ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు.

## ఎపి రాజధానిగా కర్నూలే బెటర్

### విజయవాడకన్నా అన్నీ అనుకూలతలు ఉన్నాయి
### శ్రీబాగ్ ఒప్పంద మేరకు సాగితే మంచిది
### ప్రజల్లో మళ్లీ రాజధాని డిమాండ్‌పై చర్చ

కర్నూలు,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): రాయలసీమ ప్రజలు కేవలం హైకోర్టును మాత్రమే కోరుకోవడం లేదు. కర్నూలులోనే రాజధాని ఎందుకు ఉండకూడదన్న భావనలో ఉన్నారు. తొలి ఆంధ్రాకు కర్నూలు రాజధానిగా ఉన్నదందున ఇప్పుడు వివాదాల నేపథ్యంలో ఇక్కడే రాజధాని కావాలని భావిస్తున్నారు. మైసూరా రెడ్డి లాంటి వారు తాజాగా చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే ప్రజల మనోగతం అర్థం చేసుకోవచ్చు. విశాలాంధ్ర రాష్ట్రంగా అరవైయేళ్ళకు పైగా కొనసాగిన ఆంధ్రప్రదేశ్ విభజనతో తెలుగునేల రెండుగా విడిపోయాక ఇప్పుడ కర్నూలు వాసుల్లో మళ్లీ పాత డిమాండ్ తెరపైకి వస్తోంది. కేవలం హైకోర్టు ఏర్పాటుతో తమను మరోమారు మభ్యపెట్టే ప్రయత్నాల పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధప్రదేశ్ రాష్ట్రంలో కోస్తాంధ్రలోని తొమ్మిది జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాలు ఉన్నాయి. సమైక్యాంధ్ర ఉద్యమం జరిగిన రోజుల్లో రాయలసీమ ప్రజలు తమ సొంత లాభాల గురించి ఏ మాత్రం ఆలోచించలేదు. తెలుగు ప్రజలంతా సమైక్యంగా ఉంటూ వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ఉద్యమించారు. సీమ ప్రయోజనాల కోసం గొంతెత్తి ఉంటే సీమవాసులకు ఈ దుస్థితి ఉండేది కాదు. పోలవరం లాగా రాయలసీమ డిమాండ్లన్నీ విభజన బిల్లులోనే అధికారికంగా వచ్చి ఉండేవి. రాజధాని, సాగు జలాలు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, మౌలిక వసతులు తదితర అనేక అంశాలపై వారు ఇంతకాలం మౌనంగా ఉన్నారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. రాయలసీమలోనే రాజధాని అంటూ తొలిసారిగా గళం విప్పుతున్నారు. నవ్యాంధప్రదేశ్ రాష్ట్రంలో రాజధాని విషయమై కేంద్ర హోంశాఖ 'శివరామకృష్ణన్ కమిటీ'ని నియమించింది. కొత్త రాజధాని ఏర్పాటుకు వివిధ ప్రత్యామ్నాయాలను- నీరు, భూమి, అటవీ ప్రాంత వినియోగం, సహజ వనరులు, రాబోయే రోజుల్లో పట్టణ అభివృద్ధికి గల అవకాశాలు, రవాణా సౌకర్యాలు, ఇతర ప్రాంతాలతో అనుసంధానం తదితర అంశాల ప్రాతిపదికన పరిశీలించమని కేంద్ర హోం శాఖ నిర్దేశించింది. అదే విధంగా రాజధాని నిర్మించే ప్రాంతంలో మనుగడలో ఉండే వ్యవసాయ క్షేత్రాలకు నష్టం వాటిల్లకుండా, ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలకు గురికాకుండా, పర్యావరణానికి హానికరం కాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. భూ సేకరణ, ముడిసరుకు, లభ్యత, నిర్మాణవ్యయం, తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని హోం శాఖ తెలియజేసింది. కేంద్ర హోం శాఖ నిర్దేశిరచిన కేవలం భౌతిక, సాంకేతికమైన అంశాల ఆధారంగానేకాక, చారిత్రక, ప్రాంతీయ తదితర సామాజిక అంశాల ఆధారంగా కూడా రాజధాని ఎంపిక జరిగితే ఆ నివేదికకు మరింత సమగ్రత చేకూరుతుంది. రాజధాని ఎంపికలో కేంద్ర హోం శాఖ సూచించిన అర్హతలు, అనుకూలతలు అన్నీ రాయలసీమ ప్రాంతానికున్నాయి. కర్నూలుకు అవకావం ఉందని భావించారు. తుంగభద్ర, కృష్ణా జలాల నుంచి రాయలసీమలోని ఏ ప్రాంతానికైనా, తాగు, సాగునీటిని ఎంతైనా సరఫరా చేయవచ్చు. సీమ భూభాగంలో పాతికవంతు ఉన్న అటవీప్రాంతాల్ని వినియోగించుకోవచ్చు. సాగులోని వ్యవసాయ భూములకు ఏ మాత్రం నష్టం వాటిల్ల కుండా ఎవరికీ ఇబ్బంది లేకుండానే ప్రైవేటు, ప్రభుత్వ భూములను వేల ఎకరాలు సేకరించవచ్చు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల మధ్యన మరో మహానగరంగా రాజధానిని విస్తరింపజేయవచ్చని భావించారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర భూకంపాలు రావటానికి అవకాశాలు ఉన్నాయని భూగర్భ శాస్త్ర నివేదికలు చెబుతున్నాయి. అలాంటి చోట రాజధాని నిర్మించి బిక్కుబిక్కు మంటూ బతుకీడ్చటం కంటే కర్నూలు అందుకు తగిన నేల అని స్థానిక నేతలు వాదిస్తున్నారు. శ్రీ బాగ్ ఒడంబడిక మేరకు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే రాయలసీమలో రాజధాని కృష్ణ, తుంగభద్ర జలాల్లో ప్రధానవాటా, విశ్వవిద్యాలయాలు, శాసనసభలో సమప్రాధాన్యం తదితర అనేక అంశాలపై ఆంధ్ర రాయలసీమ పెద్ద మనుషుల మధ్య పరస్పర నమ్మకం, విశ్వాసం ఆధారంగా ఒప్పందం జరిగింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి కర్నూలు రాజధాని అయింది. త్వరలోనే నిజాం రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలో కలుస్తుందని భావించి కనీస భవనాలు కట్టకుండానే గుడారాలలో కర్నూలులో పాలన సాగింది. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడడంతో హైదరాబాద్ రాజధాని నగరమైంది. అప్పుడెలాగూ సాధ్యం కాలేదు కనక ఇప్పుడయినా మళ్లీ కర్నూలుకు రాజధాని భాగ్యం కలిగించడం ద్వారా విశాల ప్రయోజనం చేకూర్చాలని కోరుతున్నారు.

## కోడి పందాలపై అయోమయం

### సంక్రాంతి ఉత్సవాలపై ఉత్కంఠ
### పాతపద్ధతుల్లోనే సాగేలా పోలీసుల నిర్ణయం

అమరావతి,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): సంక్రాంతి సందర్భంగా కోడి పందేలను నిషేధించే విషయంలో ఎలాంటి సమాచారం లేకపోవడంతో గతంలో ఉన్న ఆదేశాలకు అనగుణంగా పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. కోడిపందాలపై నిషేధం లేదని, జూదానికి అవకాశంలేని విధంగా నిర్వహించుకోవాలని ఎంపి రఘురామకృష్ణం రాజు ఇటీవలే ప్రకటించారు. సంప్రదా యబద్దంగా నిర్వహించుకుంటే అభ్యంతరం లేదన్నారు. ఈ మేరకు సిఎంతో డిజిపి సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు వివిధ జిల్లాల్లో కోడిపందాల నిర్వహణ జరక్కుండా ఇప్పటి నుంచే చర్యలకు దిగుతున్నారు. కోడిపందేలపై కఠిన వైఖరి అవలంబించనున్నట్లు పోలీస్ అధికారుల ద్వారా స్పష్టం అవుతోంది. పందెపు రాయుళ్లు కోడిపందేలు, పేకాట మానుకోకుంటే సంక్రాంతికి జైల్లోనే ఉండాల్సి ఉంటుందని హెచ్చరించారు. సంక్రాంతి ముగిసే వరకు పుంజులను స్వాధీనం చేసుకుంటారు. కోడి పుంజులకు కత్తులు కట్టే వారిని, పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకుంటారు. ఆయా ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేయనున్నారు. నదీ, సముద్ర తీర ప్రాంతాలు, లంకలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఎక్కడెక్కడ పందేలకు కోళ్లపెంచుతున్నారు, ఏయే ప్రాంతాల్లో పందేలు నిర్వహించే అవకాశం ఉందో సమాచారం తెప్పించుకుని చర్యలు తీసుకుంటారు. మరోవైపు గతంలో ఎవరెవరు కోడిపం దేలలో పాల్గొన్నారో వారి వివరాలను సేకరిస్తున్నారు. పండుగకు కుటుంబ సభ్యులు, బంధువులకు దూరం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కోడి పందేలకు కత్తులు తయారు చేసేవారు, కత్తులు కట్టే వారి వివరాలు కూడా తమ వద్ద ఉన్నాయని తెలిపారు. వారందరిపై నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. తిరిగి పందేలకు సిద్ధమైతే చర్యలు తప్పవన్నారు. గతేడాది ఇటువంటి వారిపై మారణాయుధాల చట్టం ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించామని, పద్ధతి మార్చుకోకుంటే ఈ ఏడాది కూడా మారణాయుధాల చట్టం ప్రయోగించక తప్పదని హెచ్చరించారు. గతంలో ఏ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహించారు, అందులో ఎవరెవరు పాల్గొన్నారు అనే వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. పాత కేసుల్లో నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తామంటున్నారు. పోలీసు హెచ్చరికలు భేఖాతరు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరి ంచారు. పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## డిజిపితో కాంగ్రెస్ నేతల భేటీ

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసింది. ఈ నెల 28వ తేదీన తలపెట్టిన ర్యాలీకి అనుమతి ఇవ్వాలని నేతలు డీజీపీని కోరారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కాగా ఇప్పటికే కాంగ్రెస్ ర్యాలీకి సెంట్రల్ జోన్ డీసీపీ అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. డీజీపీని కలిసినవారిలో కాంగ్రెస్ నేతలు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, జీవన్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు ఉన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే.

## లౌకిక ప్రజాస్వామ్య విలువలు విధ్వంసం

### -మోడీ తీరుపై మండిపడ్డ రాఘవులు

యాదాద్రి,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): నరేంద్ర మోదీ హయాంలో లౌకిక ప్రజాస్వామ్య విలువలు ధ్వంసమయ్యాయని సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు మండిపడ్డారు. హైందవ సంస్కృతిని అనుసరించే వారే ఈ దేశంలో ఉండాలని ఆరెస్సెస్ చీఫ్ అనడం అర్థరహితమని, అవి కేవలం మతోన్మాదాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు మాత్రమేనని అన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఓట్లేసిందని, ఎన్నార్సీపై బీజేపీ మిత్రపక్షాలతో పాటు వైసీపీ కూడా సహకరిస్తోందని ఆరోపించారు. ఎన్నార్సీపై కేసీఆర్ ఎందుకు మాట్లాటం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగానే ఎన్నార్సీని అమలు జరపకుండా కేసీఆర్ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఎన్నార్సీపై., ఎన్పీఆర్‌పై లౌకిక శక్తులను కలుపుకొని ముందుకెళ్తామని రాఘవులు ప్రకటించారు.

## సంక్రాంతికి అదనపు బస్సులు: ఆర్ఎం

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): సంక్రాంతి రద్దీని పురస్కరించుకుని అదనపు బస్సులు నడపాలన ఇఆర్టీసీ నిర్ణయించింది. ఈ సందర్భంగా 4,940 అదనపు బస్సులు నడపనున్నట్లు రంగారెడ్డి ఆర్ఎం వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో 3,414, ఆంధ్రా ప్రాంతానికి 1,526 అదనపు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. జనవరి 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అదనపు బస్సులు నడుస్తాయన్నారు. తిరిగి వచ్చే వారి కోసం జనవరి 17వ తేదీ నుంచి అదనపు బస్సులు నడుపుతామన్నారు. గత సంక్రాంతికి అదనపు బస్సులు నడపడంవల్ల రూ.5 కోట్ల ఆదాయం వచ్చిందని, ఈ సంక్రాంతికి రూ.6 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని రీజినల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు.

## మోడీ ఆర్ఎస్ఎస్ ప్రధాని

### -మండిపడ్డ కాంగ్రెస్ ఎంపి రాహుల్

న్యూఢిల్లీ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): దేశంలో ఎక్కడా డిటెన్షన్ సెంటర్లు లేవని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తప్పుపట్టారు. మోదీని ఆర్ఎస్ఎస్ ప్రధాని అంటూ పోల్చిన రాహుల్.. ఆయన భారత మాతకు అబద్దాలు చెప్తున్నారని విమర్శించారు. డిటెన్షన్ సెంటర్లపై మోదీ చేసిన కామెంట్ల వీడియోలో ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అదే వీడియోలో అస్సాంలో ఉన్న డిటెన్షన్ సెంటర్‌ను చూపించారు.ప్రధాని ఈ అంశంపై అబద్దాలు చెప్తున్నట్లు తన ట్వీట్‌కు జూట్ జూట్ జూట్ అన్న హ్యాష్ ట్యాగ్ ఇచ్చారు. ముస్లింలను డిటెన్షన్ సెంటర్లకు పంపిస్తున్నట్లు.. కాంగ్రెస్ పార్టీ, కొందరు అర్బన్ నక్సల్స్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రధాని మోదీ ఇటీవల అన్నారు. కానీ, ప్రధాని అన్నీ అబద్దాలు చెప్తున్నారని రాహుల్ తన వీడియోలో ఆరోపించారు.

## భద్రగిరిలో నేటి నుంచి ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

భద్రాచలం, డిసెంబర్ 27: భద్రాచలం దివ్యక్షేత్రం విశ్వవిఖ్యాతగాంచిన ప్రాంతం.. ఇది రామక్షేత్రమే కాదు.. పుణ్యతీర్థం కూడా.. శ్రీ వైకుంఠరాముడే మోక్ష ప్రదాత.. మోక్ష లక్ష్మి విలసిత పీఠం.. ముక్కోటి మహోత్సవాలకు ముస్తాబవుతోంది.. శుక్రవారం నుంచి భద్రగిరిలో శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. భద్రాద్రి రాముడు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ముక్కోటి ఏకాదశి మహోత్సవాలలో ప్రధాన వేడుకలైన శ్రీస్వామివారి తెప్పోత్సవం జనవరి5న జరగనుంది. కాగా, భక్తులు కనులారా తిలకించాలని వేయి కళ్లతో ఎదురు చూసే స్వామివారి ఉత్తర ద్వారదర్శనం వేడుక జనవరి 6న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి వేలాది సంఖ్యలో భక్తులు భద్రాద్రికి తరలివచ్చే అవకాశం ఉండటంతో జిల్లా అధికార యంత్రాంగం, శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. భక్తుల పాలిట పెన్నిధి భద్రాద్రి రామాలయం విద్యుత్ కాంతులతో ధగధగలాడుతూ శోభిల్లుతోంది.

రోజుకో అవతారంలో భద్రగిరి రాముడు భక్తులకు దర్శనం..

మహర్షులు వశించిన పుణ్యధామం, శ్రీరామ చంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై సంచరించిన వేద భూమి భద్రగిరి. ఇక్కడ ప్రతీ ఏట సంప్రదాయబద్ధంగా తరతరాలుగా వస్తున్న ముక్కోటి సంబురాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆ ఘడియలు రానే వచ్చాయి. వేద పండితులు ఇప్పటికే ముక్కోటి ముహూర్తాన్ని ఖరారు చేశారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులు ముక్కోటి ఏర్పాట్లను కూడా వేగవంతం చేశారు. శ్రీవైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జనవరి16వ తేదీ వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా భద్రాద్రి రాముడు రోజుకో అవతారంలో భక్తులను కనువిందు చేయనున్నారు. 27వ తేదీ మత్స్యావతారం, 28న కూర్మావతారం, 29న వరహావతారం, 30న నృసింహావతారం, 31న వామనావతారం, జనవరి 1న పరశు రామవతారం, 2న శ్రీరామావతారం, 3న బలరామావతారం, 4న శ్రీకృష్ణవతారం, 5న స్వామివారి తెప్పోత్సవం, 6న ఉత్తర ద్వారదర్శనం వేడుకలు నిర్వహించనున్నారు.

జనవరి5న గోదావరిలో శ్రీసీతారాముల జలవిహారం..

శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాల్లో స్వామివారి మత్స్యవతారంతో పగల్‌పత్తు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జనవరి5న శ్రీ సీతారామచంద్రస్వామివారు పవిత్ర పావన గౌతమి నదీ తీరంలో జలవిహారం (తెప్పోత్సవం) చేయనున్నారు. జనవరి6న ఉత్తర ద్వారదర్శనం వేడుక జరగనుంది. ముక్కోటి మహోత్సవాల్లో ఈ రెండు అత్యంత ప్రధానమైన వేడుకలు. రాష్ట్ర నలుమూలల నుంచి ఈ వేడుకలకు వేలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకుతగ్గ ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. స్వామివారు జలవిహారం గావించనున్న పవిత్ర గోదావరి తీర ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారు. జలవిహారానికి ఉపయోగించే లాంచీ ఇప్పటికే భద్రాద్రికి చేరుకుంది. హంస వాహన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గోదావరి తీరం వద్ద ప్రత్యేక ర్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ ఏర్పాట్లను ఆశాఖ సిబ్బంది చేపడుతున్నారు. ఉత్తర ద్వారదర్శనం వేడుకకు సంబంధించి ఇప్పటికే దేవస్థానం ప్రణాళికాబద్ధంగా పనులను నిర్వహిస్తోంది. ఈ వేడుకకు కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆ దిశగా దేవస్థానం ఏర్పాట్లను చేస్తోంది. రామాలయాన్ని దేదీప్యమానంగా విద్యుద్దీపాలంకరణ గావించారు. ఆలయ పరిసరాలను చాందినీ వస్త్రాలతో అలంకరించారు. అలంకరణతో భక్తులకు దర్శనమివ్వనున్న స్వామివారు వేంచేసి ఉండే మిథిలా ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్తర ద్వారదర్శనం వేడుక టిక్కెట్ల విక్రయం ప్రారంభమైంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయం కొనసాగుతోంది.

ఉత్తరద్వార దర్శనం టిక్కెట్లు సిద్ధం..

ఉత్తర ద్వారదర్శనం వేడుకకు సంబంధించి దేవస్థానం అధికారులు టిక్కెట్ల విక్రయం ప్రారంభించారు. రూ.1000, 500, 250టిక్కెట్లను విక్రయించనున్నారు. మొత్తం 3,800ల టిక్కెట్లను ఈ ఏడాది దేవస్థానం భక్తులకు విక్రయించనుంది. రూ.1000 టిక్కెట్లు 200లు ఆన్‌లైన్‌లో పెట్టడం జరిగింది. ఇవి మొత్తం విక్రయం అయ్యాయి. రూ.500 టిక్కెట్లను 1730 ఆన్‌లైన్‌లో పెట్టగా, గురువారం నాటికి 150 టిక్కెట్లు అమ్ముడుపోయాయి. రూ.250లు టిక్కెట్లు 650 ఆన్‌లైన్‌లో పెట్టగా 40 టిక్కెట్లు విక్రయం అయ్యాయి. రూ.1000ల టిక్కెట్లను మొత్తం 800లు నేరుగా భక్తులకు విక్రయించనున్నారు. జనవరి 1 నుంచి ఈ టిక్కెట్ల విక్రయం కొనసాగుతోంది. వీటితో పాటు రూ.500ల టిక్కెట్లు కూడా నేరుగా భక్తులకు విక్రయించనున్నారు. భక్తులరాకను దృష్టిలో పెట్టుకొని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు దేవస్థానం ఈవో జీ.నరసింహులు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఇదిలా ఉండగా.. కలెక్టర్ రజత్‌కుమార్ షైనీ, భద్రాచలం సబ్‌కలెక్టర్ భవేష్‌మిశ్రాల ఆధ్వర్యంలో ముక్కోటి పనుల పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. వివిధశాఖల అధికారులు ముక్కోటి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎస్పీ సునిల్‌దత్, భద్రాచలం ఏఎస్పీ రాజేష్‌చంద్ర ముక్కోటి బందోబస్తుపై దృష్టి సారించారు. ఈ ముక్కోటికి జిల్లాలోని 1200 మందికి పైగా పోలీస్‌లు విధులు నిర్వహించనున్నారు.



# అమరావతిని మార్చొద్దు

- రైతుల ఆందోళన ఉధృతం, ఉద్రిక్తత
- రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపిన రైతులు, మహిళలు
- యూనివర్శిటీ బస్సు అద్దాలు పగలగొట్టిన ఆందోళనకారులు
- మీడియా ప్రతినిధులపైనా దాడి
- ఎర్రపాలెంలో టైర్లుకాల్చి రైతుల నిరసన
- రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆందోళనకు మద్దతు తెలిపిన టీడీపీ నేతలు.. అరెస్టు చేసిన పోలీసులు

అమరావతి, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : మూడు రాజధానుల ప్రతిపాదనలపై అమరావతి ప్రాంతం శుక్రవారం అట్టుడికింది. నిరసనలు హోరెత్తాయి. మందడం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. 144 సెక్షన్ విధించినప్పటికి రోడ్లపైకి వచ్చేందుకు రైతులు, మహిళలు ప్రయత్నించారు. అయితే వారిని పోలీసులు అడ్డుకోవడంతో... తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తీవ్ర ఆక్రోశానికి లోనైన మహిళలు... పోలీసులపై విరుచుకుపడ్డారు. మా భూములు తీసుకుని మమ్మల్నే అడ్డుకుంటారా అంటూ... ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రశాంతంగా ఆందోళనలు చేసుకోనివ్వారా అంటూ తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. దీంతో పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. రాజధానిపై ఏపీ కేబినెట్ ఏ నిర్ణయంపై తీసుకుంటోందనన్న ఉత్కంఠ ఓవైపు కొనసాగుతుంటే.. మరోవైపు రాజధాని గ్రామాల్లో రైతులు ఆందోళనలు కొనసాగించారు. తుళ్లూరులోను రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో తమకు అనుకూల నిర్ణయం తీసుకోవాలని నినాదాలు చేశారు. శుక్రవారం ఉదయం ఓ యూనివర్సిటీ బస్సులు అద్దాలు పగలగొట్టిన ఆందోళనకారులు... ఉద్దండరాయునిపాలెంలో మరింత రెచ్చిపోయారు. మీడియా ప్రతినిధులపై దాడికి దిగారు. తమకు వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేస్తున్నారంటూ మీడియా ప్రతినిధులపై దాడిచేశారు ఆందోళనకారులు. మీడియా సిబ్బంది ప్రయాణిస్తున్న కారుపైనా అటాక్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉద్రిక్తత తలెత్తింది. అయితే.. ఆందోళనకారులు దాడిచేస్తున్న సమయంలో పోలీసులు అక్కడే ఉన్నా.. వారు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. మరోవైపు రాజధాని ప్రాంతంలో ఆందోళనలు కొనసాగాయి. రాజధాని వికేంద్రీకరణను వ్యతిరేకిస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. అమరావతి పరిధిలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కావాలంటే తమ భూములు ఇచ్చామనీ ఇప్పుడు ప్రభుత్వం మారినట్లుగా రాజధానిని కూడా మారుస్తామంటే ఊరుకునేది లేదని ఆందోళన చేస్తున్న రైతుల్ని పోలీసులు అడ్డుకున్నారు. వారిని బలంతంగా వ్యానుల్లోకి ఎక్కించటంతో ఆవేదన చెందిన రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మా ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి సీఎం అయి ఇప్పుడు మమ్మల్ని అరెస్ట్ చేసి జైల్లో పెడతారా అంటూ ప్రశ్నిస్తున్నారు. రైతుల్ని బాధ పెట్టిన ఏ ప్రభుత్వం నిలవలేదనీ ఇప్పుడు మా భూములు తీసుకుని మమ్మల్ని అన్యాయంచేస్తూ రాజధానికి తరలిస్తున్నారనీ మాకు న్యాయం చేయమని అడిగితే అరెస్టులు చేస్తారా మమ్మల్ని దొంగల్లా చూస్తారా ఇటువంటి ప్రభుత్వం ఎంతో కాలం ఉండని రైతులు శపిస్తున్నారు. మా ఇంట్లో ఆడవాళ్లు కూడా నడిరోడ్డుమీదికి తీసుకొచ్చిన ఈ ప్రభుత్వం పడిపోతుందని రైతుల్ని, మహిళల్ని వేదనకు గురిచేసే ప్రభుత్వాలు నిలవని అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని రైతులు ఆవేదనతో హెచ్చరరించారు. మాకు

జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? మీరు మమ్మల్ని జైల్లో వేసిన మా ఆందోళన మానేది లేదని మందడంలోని రైతులు స్పష్టంచేశారు. మా ఉద్యమాన్ని కొనసాగిస్తామని మూడు రాజధానుల నిర్ణయంపై ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని..అమరావతినే రాజధాని అని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెదకాకాని వద్ద తెదేపా నేతల అరెస్టు..

మూడు రాజధానుల ప్రతిపాదనలపై నిరసనలు కొనసాగాయి. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో ప్రజలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగిన పార్టీ కార్యకర్తలు, నేతలను పోలీసులు అరెస్టు చేసి పెదకాకాని స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా రాజధానిని అమరావతిలోనే ఉంచాలని డిమాండ్ చేస్తూ గొల్లపూడిలో నిరసన చేపట్టిన మాజీ మంత్రి దేవినేని ఉమను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజ్యాంగవరమైన నిర్ణయాలతో అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేశామని దాన్ని ఇప్పుడు సీఎం జగన్ తన స్వార్థ ప్రయోజనాల కోసం మూడు రాజధానులని ప్రకటించి విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానికిగా ప్రకటించారని ఇదంతా కుట్ర.. రైతుల్ని అన్యాయంచేస్తున్నారంటూ సీఎం జగన్ ప్రభుత్వంపై దేవినేని మండిపడ్డారు.

విశాఖలోని భూముల్ని స్వాహా చేయటానికి జగన్ విశాఖను రాజధానిగా ప్రకటించారని ఆరోపించారు. వైసీపీ నేతలంతా ఇప్పటికే విశాఖలో భూములు కొన్నారనీ అందుకే విశాఖను రాజధానిగా చేయటానికి ఉత్తరాంధ్రను దోచుకోవాటానికే ఈ పన్నాగాలని ఆరోపించారు. ప్రభుత్వ ప్రతిపాదనలకు నిరసనగా మందడంలో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు కొనసాగాయి. గ్రామంలో 144 సెక్షన్ విధించినప్పటికీ.. రైతులు, మహిళలు పెద్దఎత్తున బయటకొచ్చి ఆందోళన చేసేందుకు యత్నించారు. సచివాలయానికి ముఖ్యమంత్రి వెళ్లిపోయిన తర్వాత కూడా నిరసనలను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో మహిళలంతా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎర్రబాలెంలోనూ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. రోడ్డుపై టైర్లు కాల్చి రైతులు నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజధాని అంశంపై తీరు మార్చుకోకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రాజధానిని అమ్మేందుకే జగన్ కుట్ర

- బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ
- మోదీ శంకుస్థాపన చేసిన స్థలంలో గంటపాటు మౌనదీక్ష చేసిన కన్నా

గుంటూరు, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : రాజధానిని అమ్మేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుట్ర పన్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. రాజధాని ప్రాంత రైతుల ఆందోళనలకు మద్దతుగా ఉద్దండరాయ పాలెంలో అమరావతి కోసం ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన స్థలంలో ఆయన గంటపాటు మౌన దీక్ష చేపట్టారు. దీక్ష విరమించిన అనంతరం కన్నా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని భూములను నచ్చిన వారికి అమ్ముతామని వైకాపా నేతలు చెబుతున్నారని ఆరోపించారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను జగన్ నిట్టనిలువునా ముంచుతారని ఎవరూ ఊహించలేదని కన్నా వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని సొంత జాగీరుగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని, అందుకే రాజధానిని గంపగుత్తగా అమ్మేసేందుకుయత్నిస్తున్నారని విమర్శించారు. రాజధానికోసం రైతులు చేసిన త్యాగం గుర్తించి పన్ను చెల్లింపుల విషయంలో కేంద్రం మినహాయింపు ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం గతంలో ప్రధాని మోదీ అన్ని ప్రాంతాల్లో కేంద్ర సంస్థలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మౌలికవసతుల కల్పనకు కేంద్రం కృషిచేసిందని చెప్పారు. ఏం సాధించారని విశాఖలో సంబరాలు చేసుకుంటున్నారని కన్నా ప్రశ్నించారు. జగన్ తప్పుడు నిర్ణయాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై భాజపా గట్టిగా పోరాటం చేస్తుందని, ఇందులో భాగంగానే మొదటి అడుగుగా మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మౌన దీక్ష చేశామని కన్నా వివరించారు. జీఎన్‌రావు కమిటీని తాను స్వాగతించినట్లు బొత్స చేసిన వ్యాఖ్యలపై కన్నా మండిపడ్డారు. ఇదిలా ఉంటే కేబినెట్ నిర్ణయం తరువాత తమ తమ ఆందోళనలను ఉధృతం చేస్తామని తెలిపారు.0

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురేస్తాం

## ఉమ్మడి జిల్లాలో తమకు పోటీయే లేదు
## కెసిఆర్ పథకాలే మాకు అండ: జోగురామన్న

ఆదిలాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలంటే మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని టిఆర్ఎస్ కార్యకర్తలకు మాజీమంత్రి,ఎమ్మెల్యే జోగు రామన్న పిలుపునిచ్చారు. పంచాయితీల్లో లాగానే మున్సిపాలిటీలల్లో కూడా టిఆర్ఎస్ ఎలవాలని అన్నారు. పట్టణాలు కూడా అభివృద్ధిలో పయనించాలన్నారు. వచ్చే నెలలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్‌లకు అవకావం వస్తే అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగానే ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులను కడుపులో పెట్టుకుని చూసుకుంటామన్నారు. నామినేటెడ్ పదవుల్లో సీనియార్టీ, క్రమశిక్షణ గల కార్యకర్తలకు స్థానం కల్పిస్తున్నామని తెలిపారు. పార్టీ నిర్ణయం మేరకు మున్సిపల్ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఆదిలాబాద్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిలాబాద్ మున్సి పాలిటీని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసిందన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి ముఖ్యమంత్రి కేసీఆర్ భారీగా నిధులు మంజూరు చేశారని దీంతో రోడ్లు, మురికి కాల్వలు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఫలితంగా పట్టణంలో నివసించే ప్రజలకు వసతులు ఎంతగానో మెరుగుపడినట్లు ఆయన తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులకు గానూ అత్యధిక వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి ప్రయోజనం చేకూర్చాయని, దీంతో ప్రజలు మరోసారి గులాబీ పార్టీకి పట్టం కట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహిస్తామని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రతిపక్షాల నుంచి కనీస పోటీ ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వం చేపట్టిన పథకాలతో గ్రామాలతో పాటు పట్టణాల్లో సైతం ప్రజల ఉపాధి ఎంతో మెరుగుపడింది. 24 గంటల విద్యుత్, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, అమ్మఒడి, పేద విద్యార్థులు చదువుకునేలా రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, సర్కారు పాఠశాల విద్యార్థులకు సన్నబియ్యంతో కడుపునిండా భోజనం, పేదలకు రూ.1 కిలో బియ్యం పంపిణీ, స్వయం ఉపాధిలో భాగంగా రుణాల అందజేత లాంటి కార్యక్రమాలు పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. దీంతో ప్రజలు ఏ ఎన్నికలు జరిగినా టీఆర్ఎస్‌కు పట్టం కడుతున్నారు. టీఆర్ఎస్ నాయకులు సైతం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం మరోసారి గులాబీ పార్టీకి అండగా నిలువనున్నారని జోగురామన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆ మూడుగంటలు ఏం చర్చించారు

## ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు అసద్ యత్నం
## మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్,డిసెంబర్27 (ఆంఎన్ఎ): ఇటీవల సీఎం కేసీఆర్, అసద్‌లు మూడు గంటల పాటు జరిపిన చర్చ దేనికి సంకేతమని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డా.లక్ష్మణ్ ప్రశ్నించారు. వీరిద్దరూ రహస్యంగా మంతనాలు జరపాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు. ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఎంపీలు ఓటు వేశారు. కాంగ్రెస్, మజ్లిస్, కమ్యూనిస్టులంతా వ్యతిరేకిస్తున్నారు. ఆ కోవలోకే టీఆర్ఎస్ వచ్చింది' అని తెలిపారు. దేశంలో అలజడులు, అల్లర్లు సృష్టించాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని వ్యాఖ్యానించారు. పూర్వీకుల వివరాలు చెప్పాలంటే అసద్ ఎందుకు భయపడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎందుకు అభ్యంతరమో కేసీఆర్ కూడా సమాధానం చెప్పాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో అన్ని వివరాలు తీసుకున్నారని.. అవి ఎందుకు బహిర్గతం చేయలేదో చెప్పాలన్నారు. తమ అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియలో స్వలాభం కోసమే సమగ్ర సర్వే చేశారని విమర్శించారు. అసద్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని.. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల కోసం కొంత గడువు ఇవ్వాలని కోరారు. ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఆర్సీ గురించి ప్రజలకు వివరిస్తామని లక్ష్మణ్ వెల్లడించారు.

# ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నం

జనగామ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): నర్మెట్ట ఎమ్మార్వో కార్యాలయంలో ముందు పురుగుల మందు, పెట్రోల్ బాటిల్‌తో బాధిత రైతులు ప్రమీల ఆమె కుటుంబ సభ్యులు ఆత్మహత్యయత్నం చేశారు. నర్మెట్ట మండలం గండిరామరం గ్రామంలో సర్వే నెంబర్లు 186/శ4 లో 2- 28 గుంటల భూమికి సంబంధించిన పట్టా చెయ్యట్లేదని, అధికారపార్టీ నాయకులు బెదిరిస్తున్నారని, పట్టా అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధిత రైతులను అదుపులోకి తీసుకున్నారు.

# జనవరి 21న హైదరాబాద్ లో తపాలా పెన్షన్ అదాలత్

హైదరాబాద్, డిసెంబర్ 27: తపాలా పెన్షనర్స్ కి సంబంధించి ప్రజల ఫిర్యాదులను, సమస్యలను తెలుసుకొనేందుకు 2019 జనవరి 21వ తేదీన మధ్యాహ్నం 02.30 గంటల కు హైదరాబాద్ లోని ఆబిడ్స్ లో గల డాక్ సదన్ లో 'పెన్షన్ అదాలత్' ను నిర్వహించనున్నట్లు అసిస్టె0ట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీ శివ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టల్ పెన్షనర్లు / కుటుంబ పెన్షనర్ల పెన్షన్, గ్రాట్యుటీకి సంబంధించిన ఫిర్యాదులను తపాలా విభాగం లోని ద డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ (తపాలా), డాక్ సదన్, హైదరాబాద్-500001, చిరునామా కు కవర్ పైన "పోస్టల్ పెన్షన్ అదాలత్ ఆఫ్ తెలంగాణ సర్కిల్" అనే పదాలు రాసి తపాలా కవర్ లో 2020 జనవరి 10వ తేదీ లోపు తెలియ జేయవచ్చు. వ్యక్తిగత పెన్షనర్లు / కుటుంబ పెన్షనర్లు ప్రాంతీయ/డివిజనల్ స్థాయి పెన్షన్ అదాలత్ వద్ద తీసుకున్న కేసు యొక్క వాస్తవాలను సక్రమంగా అందించాలి మరియు ప్రాంతీయ/డివిజన్ స్థాయి ఇచ్చిన ఏదైనా ప్రత్యుత్తరం కాపీ ఉంటే, పెన్షన్ అదాలత్ కి సమర్పి0చాలి. నిర్ణీత తేదీ తర్వాత అందుకున్న అభ్యర్థనలు పరిగణలోకి తీసుకొనబడవు. దరఖాస్తు దారులు కావాలనుకుంటే వ్యక్తిగతంగా అదాలత్‌కు హాజరుకావచ్చు.

# డబ్బుతో గెలవాలని చూస్తున్నారు: జగ్గారెడ్డి

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): మునిసిపల్ ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని తమ ఘనతగా చెప్పుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సంగారెడ్డిలో అభివృద్ధి జరిగిందని జగ్గారెడ్డి తెలిపారు. రిజర్వేషన్ల ఖరారు తర్వాత అభ్యర్థులను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సంగారెడ్డి మునిసిపల్ చైర్మన్ అభ్యర్థి బీసీలకు కేటాయిస్తే.. నిర్మలా జగ్గారెడ్డికి టికెట్ ఇస్తామన్నారు. సంగారెడ్డి, సదాశివపేటలో కాంగ్రెస్‌దే గెలుపని జగ్గారెడ్డి జోస్యం చెప్పారు.

# సోరెన్ ప్రమాణానికి వెళ్లనున్న మమతా బెనర్జీ

కోల్‌కతా,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ నాయకులు హేమంత్ సోరెన్ ఈ నెల 29న జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో పాటు టీఎంసీ నాయకులు హాజరు అవుతారని తృణమూల్ సీనియర్ నాయకులు మీడియాకు వెల్లడించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీతో మరియు హేమంత్ సోరెన్‌తో మంచి సంబంధాలను నెరుపుతామని పేర్కొన్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో హేమంత్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి రావాలని కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీని హేమంత్ సోరెన్ కోరిన విషయం విదితమే. 81 స్థానాల జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి 47 స్థానాల్లో విజయం సాధించి.. బీజేపీని మట్టి కరిపించిన సంగతి తెలిసిందే. బీజేపీ 25, ఇతరులు 9 స్థానాల్లో గెలుపొందారు.

# మాజీ ఎంపీ హర్షకుమార్‌కు అస్వస్థత..
## - ఐసీయూలో చికిత్స

అమరావతి, డిసెంబర్27(ఆర్ఎన్ఎ) : మాజీ ఎంపీ హర్షకుమార్ అస్వస్థతకు గురయ్యారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను.. అక్కడి సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రికిత తరలించగా.. ఐసీయూలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. హర్షకుమార్ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్నది క్లారిటీ రాలేదు. జ్యుడిషియల్ సిబ్బందిని దూషించిన కేసులో హర్షకుమార్‌ను రెండు వారాల క్రితం పోలీసులు అరెస్ట్ చేశారు. 75 రోజులపాటు అజ్ఞాతంలో ఉన్న ఆయన.. రాజమండ్రి వెళ్లగా.. అక్కడే అదుపులోకి తీసుకున్నారు. వైద్యపరీక్షల అనంతరం పోలీసులు మాజీ ఎంపీని రాజమండ్రి 7వ అదనపు కోర్టు జడ్జి ఎదుట హాజరు పరిచారు. హర్షకుమార్‌కు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన మెజిస్ట్రేట్. ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో మాజీ ఎంపీని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. హర్షకుమార్ వర్గం పోలీసుల తీరుపై విమర్శలు చేశాయి. ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపుకు పాల్పడుతోందని వారు మండిపడ్డారు. తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో జైల్లో ఉన్న ఆయన అస్వస్థతకు గురికావడంతో హర్షకుమార్ అనుచరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# యూపీలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

లక్నో ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో గత కొద్ది రోజుల నుంచి ఆందోళనలు కొనసాగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో శుక్రవారం మసీదుల్లో ప్రార్థనలు ముగిసిన అనంతరం సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసే అవకాశం ఉందని ఆ రాష్ట్ర డీజీపీ ఓపీ సింగ్ వెల్లడించారు. యూపీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. బిజ్నూర్, బులంధ్‌సాహర్, ముజఫర్‌నగర్, మీరట్, ఆగ్రా, ఫిరోజాబాద్, సాంభాల్, అలీఘుర్, ఘజియాబాద్, రామ్‌పూర్, సితాపూర్, కాన్పూర్‌తో పాటు పలు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. 75 జిల్లాలకు గానూ 21 జిల్లాల్లో పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశామన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కంట్రోల్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర బలగాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించామని తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించే అంశంపై ఆలోచిస్తామన్నారు డీజీపీ. తాము అమాయకులను ముట్టుకోవడం లేదు. హింస, ఆందోళనలకు ప్రేరేపిస్తున్న వ్యక్తులను మాత్రమే అదుపులోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# పాతబస్తీలో భారీగా గంజాయి స్వాధీనం

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): పాతబస్తీలోని శాలిబండ పోలీసు స్టేషన్ పరిధిలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

ఐదుగురు వ్యక్తుల నుంచి 4 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెల్లడించారు.

గంజాయిని తరలిస్తున్న రెండు కార్లను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ గంజాయిని విశాఖ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులంతా హైదరాబాద్ పాతబస్తీ వాసులు అని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కజికిస్తాన్‌లో ఘోర విమాన ప్రమాదం

## టేకాఫ్ అయిన వెంటనే కుప్పకూలిన విమానం
## 14 మంది మృతి..పలువురికి గాయాలు

న్యూఢిల్లీ,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): కజకిస్తాన్‌లో ఆల్మాటీ నగరంలో శుక్రవారం ఉదయం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఆల్మటీ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన బేక్ ఎయిర్ విమానం కుప్పకూలిపోయింది.



విమానాశ్రయానికి సమీపంలో ఉన్న రెండు అంతస్తుల భవ నాన్ని విమానం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో 95 మంది ప్రయాణికులు, ఐదుగురు విమాన సిబ్బంది ఉన్నారు. ఈ ప్రమాదంలో 14 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.

కొందరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినట్లు తెలుస్తుంది. మృతుల సంఖ్య పెరిగే అవ కాశం ఉంది. విమానం ఆల్మటీ ఎయిర్‌పోర్టు నుంచి కజకిస్థాన్ రాజధాని నూర్ సుల్తాన్‌కు బయల్దేరిన సమయంలో ప్రమా దం జరిగినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు నిర్ధారించారు. విమానం కుప్పకూలిన స్థలానికి చేరుకున్న అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద ఘటనపై దర్యాప్తుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు అధికారులు. ఈ ప్రమాదంపై కజకిస్థాన్ ప్రెసిడెంట్ క్యాసమ్ జోమార్ట్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రెసిడెంట్ ప్రార్థించారు.

# బిజెపి విధానాలు దేశానికి ప్రమాదం: ఏచూరి

హైదరాబాద్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు దేశానికి చేటుగా పరిణమించాయని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీలో సేవ్ ఇండియా- సేవ్ రాజ్యాంగం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పౌరసత్వ సవరణ చట్టం, ఎన్ఆర్సీ అనేవి రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాదానికి పాల్పడుతుందని అన్నారు. ఎన్ఆర్సీ పేరుతో ప్రజలను మతోన్మాదంవైపు తిప్పుతోందని అన్నారు. భారత దేశాన్ని లౌకికవాద దేశం నుండి హిందుత్వ దేశంగా మార్చాలని ఆర్ఎస్ఎస్‌తో కలిసి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దేశంలో ఆర్థిక మందగమనాన్ని పక్కదారి పట్టించేందుకే కేంద్రం సీఏఏను ముందుకు తీసుకువచ్చిందని ఆరోపించారు. ధరలను తగ్గించడంతో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. విద్యార్థులంతా కలిసి దేశాన్ని కాపాడాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ప్రధాని మోడీ

## ప్రజా సమస్యలు గాలికి వదిలేశారన్న గెహ్లాట్

జైపూర్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మరోసారి మండిపడ్డారు. సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్ పేరుతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ప్రజలను గందరగోళంలో పడేస్తున్నారని, దేశాన్ని పట్టిపీడిస్తున్న నిజమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మతాల మధ్య అనైక్యతను వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేసి, ఎన్ఆర్సీ జోలికి వెళ్లమని దేశానికి భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. సీఏఏ-ఎన్ఆర్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు నిరసనలు చేస్తుంటే కొత్త చట్టాన్ని వెనక్కి తీసుకోవడానికి బదులు, ఎన్ఆర్పీని తెరపైకి తెచ్చారు. దేశాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రధాని ఒక మాట చెబుతుంటే, దానికి భిన్నంగా హోం మంత్రి అమిత్‌షా మరో మాట చెబుతున్నారు. ఇలా పొంతన లేని ప్రకటనల వల్లే ప్రజల్లో భయాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి' అని గెహ్లాట్ అన్నారు. ఆలోచన లోపించిన సీఏఏ-ఎన్ఆర్పీ, ఎన్పీఆర్‌తో ప్రధాని, హోం మంత్రి కలిసి దేశాన్ని కల్లోలం వైపు, అశాంతి వైపు నెట్టేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజల్లో భయాందోళనలు తొలగించడానికి బదులు మోదీ, అమిత్‌షా పరస్పర విరుద్ధమైన మాటలు చెబుతూ అనిశ్చితిని మరింత పెంచుతున్నారని, ఇది అశాంతికి కారణమవుతోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవాలతో ముందుకు రావాలని, నిజాలు చెప్పాలని గెహ్లాట్ అన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో జాతీయ ఆదివాసీ నృత్య వేడుకలు

## రాహుల్ గాంధీ చేతుల మీదుగా వేడుకలు ప్రారంభం

రాయపూర్,డిసెంబర్27(ఆర్ఎన్ఎ): ఛత్తీస్‌గఢ్‌లో జాతీయ ఆదివాసీ నృత్య వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఈ వేడుకలను ప్రారంభించారు. రాయ్‌పూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బగేల్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఆదివాసీ గెటప్‌లో.. డోల్ వాయిస్తూ.. అందర్నీ అలరించారు. స్టేజ్‌పై గిరిజనులతో కలిసి.. డాన్స్ చేశారు. కాగా, ఈ ఆదివాసీ నృత్యోత్సవ వేడుకలకు 25 రాష్ట్రాల్లోని ఆదివాసీలతో పాటుగా.. కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 1200 మంది గిరిజన నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. అంతేకాదు.. శ్రీలంక, ఉగాండా, బెలరస్, మాల్దీవులు, థాయిలాండ్, బంగ్లాదేశ్ దేశాలకు చెందిన ట్రైబల్స్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు కూడా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. తెలంగాణ గిరిజనులు గుస్సాడీ నృత్యాన్ని, ఏపీ గిరిజనులు థింసా నృత్యాన్ని ప్రదర్శించనున్నారు. మొదటి స్థానంలో నిలిచిన బృందానికి రూ. 20 లక్షల బహుమతి, రెండో స్థానంలో నిలిచిన బృందానికి రూ. 12 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన బృందానికి రూ. 8 లక్షల బహుమతి ఇవ్వనున్నారు.

# కార్గిల్‌లో 145 రోజుల తర్వాత ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణ

న్యూఢిల్లీ, డిసెంబర్27: జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీన కేంద్రం రద్దు చేసిన విషయం విదితమే. దీంతో నాడు నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా జమ్మూకశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగిన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరిస్తున్నారు. 145 రోజుల తర్వాత కార్గిల్‌లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించినట్లు పోలీసులు వెల్లడించారు. గత నాలుగు నెలల నుంచి కార్గిల్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. అయితే ఇంటర్నెట్ సేవలను దుర్వినియోగం చేసుకోవద్దని పలు మతాల పెద్దలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పరిస్థితులను బట్టి జమ్మూ రీజియన్‌తో పాటు కశ్మీర్ వ్యాలీలో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించనున్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో మోహరించిన 7 వేల కేంద్ర పారామిలటరీ బలగాలను ఇటీవలే కేంద్రం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే.



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.